



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 56 | ది. 30-5-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 56 | Date : 30-5-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్

- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్ చేసేలా సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి
- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఏం సూర్యఘర్ అమలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,మే 29 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను... అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అను-సంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు... టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

**పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెరగాలి..** సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు "ఏపీ సైబర్ గార్డ్"

- 6 పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో నేరాలకు అడ్డుకట్ట
- ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి...సైబర్ పెట్రోలింగ్ జరగాలి
- సైబర్ మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్ రూంలో జీరో ఎఫ్ఐఆర్
- ఏపీలో సైబర్ నేరానికి పాల్పడితే... తప్పించుకోలేమనే భయం క్రిమినల్స్‌కు కలగాలి
- ప్రజలు నష్టపోకుండా బ్యాంకులు సహకరించాలి
- సైబర్ నేరాల అడ్డుకట్టకు పోలీసు శాఖ కార్యాచరణపై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి,మే 29 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో సైబర్ నేరాల అడ్డుకట్టకు జీరో ఎఫ్ఐఆర్ విధానం అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బాధితులు సైబర్ వార్ రూమ్‌కు ఫోన్ చేసిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బ్యాంకులను అప్రమత్తం చేసి గోల్డెన్ అవర్ టైంను వినియోగించుకుని అకౌంట్ల నుంచి డబ్బులు బదిలీ కాకుండా చూడాలని సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు బ్యాంకులూ సహరించాలన్నారు. సైబర్ నేరాలపై అన్ని వర్గాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని, అవగాహనా కార్యక్రమాలు పెంచాలని సీఎం సూచించారు. పోలీస్ పెట్రోలింగ్ తరహాలోనే సైబర్ పెట్రోలింగ్ జరగాలని, ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా చూడాలని సీఎం సూచించారు. నేరం జరిగిన తరువాత ఫిర్యాదు రావడం, పోలీసులు విచారణ జరపడం కంటే...అసలు నేరమే జరిగే అవకాశం లేకుండా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ గా చేసుకుని జరుగుతున్న నేరాల పట్ల వారికి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు తీసుకుంటున్న చర్యలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. 6 పిల్లర్ రెస్పాన్స్ టీమ్స్‌తో వివిధ రకాల సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు తాము సిద్ధం చేస్తున్న ప్రణాళికలను ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

**28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు... 4 రీజనల్ హబ్‌లు : డీజీపీ..** ప్రజెంటేషన్‌పై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ..."సైబర్ నేరాలను అరికట్టేందుకు సిక్స్ పిల్లర్ వ్యవస్థలతో ఏపీ సైబర్ గార్డ్ అనే సమగ్ర సైబర్ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. 6 పిల్లర్ సైబర్ భద్రతా వ్యవస్థలో సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్ బోర్డ్, టెక్నాలజీడఏఐ, కెపాసిటీ బిల్డింగ్, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడతాం. 6 పిల్లర్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఒక సైబర్ వార్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో ఇప్పటికే భవనాన్ని ఎంపిక చేశాం. ఈ సైబర్ వార్ రూంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్, సైబర్ థ్రెట్ ఇంటలిజెన్స్ అండ్ ఎనలటిక్స్, సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్, సైబర్ ట్రైనింగ్ అండ్ అవేర్నెస్ రీసెర్చ్, లీగల్, పాలసీ అండ్ కంప్లైంట్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ వంటి మొత్తం 11 విభాగాలు పనిచేస్తాయి. రానున్న 30 రోజుల్లో ఆధునిక సదు-పాయాలతో ఈ వార్ రూం అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న 1930 హెల్ప్ లైన్ కాల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేస్తాం. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ (చీజక్రా), 1930 హెల్ప్‌లైన్‌తో సమగ్ర డ్యాష్‌బోర్డ్ తీసుకువస్తున్నాం.

# జూన్ 2న డాక్టర్ డా.ఎన్.టీ.ఆర్ హెల్త్ యూనివర్సిటీ 29, 30వ కాన్వకేషన్



**విజయవాడ,మే 29 (వార్తాప్రభ) :** డాక్టర్ ఎన్.టి.ఆర్. యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, విజయవాడ 29, 30 వ వార్షిక కాన్వకేషన్ ను జూన్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో సంయుక్తంగా నిర్వహించనున్నట్లు విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎన్.టి.ఆర్. యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ముఖ్య ప్రసంగం చేయడంతో పాటు విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ పథకాలు ప్రదానం చేయనున్నారన్నారు. కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందన్నారు. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన ఇద్దరు ప్రముఖ కార్డియాలజిస్టులకు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్.సి.) పురస్కారాలను ప్రదానం చేయనుందన్నారు. హైదరాబాద్‌లోని ఏఐజి హాస్పిటల్ కు చెందిన ప్రముఖ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి. నరసింహన్, అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.సి. రథ్ ఈ గౌరవానికి ఎంపికయ్యారయ్యారన్నారు. 29, 30వ కాన్వకేషన్ కు సంబంధించి మొత్తం 122 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు 162 పతకాలు ప్రదానం చేయనున్నారన్నారు. వీటిలో 123 బంగారు పథకాలు, 39 వెండి పథకాలు ఉన్నాయన్నారు. అదనంగా 37 ఎండోమెంట్ బహుమతులను కూడా అందజేయనున్నారన్నారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా విద్యా సంవత్సరాల్లో ఏర్పడిన జాప్యం నేపథ్యంలో గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రెండు కాన్వకేషన్ లు కలిపి నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు. వచ్చే ఏడాది నుంచి యథావిధిగా ఒకే కాన్వకేషన్ ను నిర్వహిస్తామని వెల్లడించారు. కాన్వకేషన్ నికి ముందు రోజు జూన్ 1 వ తేదీ సాయంత్రం విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ప్రీ-కాన్వకేషన్ గెట్-టుగెదర్ డిన్నర్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.


## వేలం ప్రకటన

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

E. P. No.140 / 2019
in
O.S.No. 93 / 2017

Between :
పంచపర్వాల విజయసారధి -----------D. Hr
మరియు
గొర్రెు రమేష్‌బాబు -----------J. Dr

పై నెంబరు డిక్రీ బాకీని రాబట్టుకునే నిమిత్తం J. Dr యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలోగల యీదిగువ షెడ్యూలు దాఖలాఆస్థిని ది. 18.06.2026న ఉదయం గం. 10.30 ని.ల నుండి పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. కావున పాడుకొనదలచినవారు సదరు వేలం పాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడు కొనవచ్చును.

**షెడ్యూలు :** కృష్ణా జిల్లా, పెడన సబ్ రిజిస్ట్రారు వారియిలాకా పెడన మండలం నడుపూరు గ్రామంలోని R.S. No. 115 / 6 నందుగల చ.గ.181ల ఖాళీ ఇంటి స్థలమునకు గల హద్దులు : **తూర్పు:** బందరు to తిరువూరు రోడ్ -56 1/2 లింకులు, **దక్షిణం :** పరసా హనుమంతరావుగారి స్థలం-68 లింకులు, **పడమర:** గొర్రెు బాబూరావుగారి స్థలం -53 1/2లింకులు , **ఉత్తరం :** 4 1/2లింకుల వెడల్పు గల నడక దారి -88లింకులు.

D.Hr **విలువ :** Rs. **3,25,000/-**
**అమీనా విలువ :** Rs.**10,50,000/-**
**మార్కెట్ విలువ:** Rs.**3,07,700/-**
(శ్రీ కోర్టు వారి యుత్తర్వుల ప్రకారం)
వేలం తేదీ. 18.06.2026

**Note :** E.C. దాఖలా షెడ్యూలు ఆస్తికి వున్న తనఖా పై D.Hr కి డిక్రీ బాకీ అయినందున మరియు జప్తు అనంతరం జరిగిన అమ్మకమునకు లోబడిన అవసరం లేదు

**శిర్విశెట్టి నగధర్ నాథ్**
D. Hr **తరపున అడ్వకేట్**
**మచిలీపట్నం**





# బహుముఖ ప్రజ్ఞాశాలి సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్

● సర్వీసు రూల్స్ పై అపార అనుభవం వారి సొంతం ● సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్









**విజయవాడ,మే 29 (వార్తాప్రభ) :** సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశేష సేవలు అందించిన పి. కిరణ్ కుమార్ శాఖకు ఒక ఆదర్శమని డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం విజయవాడ ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు పి. కిరణ్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమానికి సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ... 33 ఏళ్లపాటు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ శుక్రవారం సమాచార పౌర సంబంధాల శాఖలో ఆయన పదవీ విరమణ సందర్భంగా శాఖ తరఫున ఘనంగా సత్కరించారు. ఒకే సమయంలో విభిన్న విభాగాల బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేవారని ఆయన తెలిపారు. అవుట్‌డోర్ పబ్లిసిటీ, అడ్మినిస్ట్రేషన్, ఢిల్లీ విభాగాలు, ఫోటోగ్రఫీ, క్యాబినెట్ మీటింగ్ బ్రీఫింగ్స్, రిపబ్లిక్ డే శకటాల రూపకల్పనతో పాటు అసోసియేషన్ బాధ్యతలను కూడా ఆయన ఏకకాలంలో విజయవంతంగా నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. శాఖకు సంబంధించిన ప్రతి జీవో రూల్స్ పూర్తి హిస్టరీని ఆయన వేళ్లపై ఉంచుకునేవారన్నారు. అనేక చట్టాలు, నిబంధనల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని, నిబంధనలపై ఆయనకున్న పట్టు శాఖకు ఎంతో మేలు చేసిందని కొనియాడారు. 2023 తో పోలిస్తే, ఆ తర్వాత జరిగిన అతిపెద్ద 'పార్టనర్‌షిప్ సమ్మిట్' అని, మీడియా మేనేజ్‌మెంట్, కవరేజ్ బాధ్యతలను ఎలాంటి లోపాలు లేకుండా కిరణ్ కుమార్ విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక బ్రాండ్‌గా నిలబెట్టడంలో ఈ సమ్మిట్ విజయం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దేశ రాజధాని వేదికగా ఎంతో ఆకట్టుకున్న ఆంధ్రప్రదేశ్ 'ఏటికొప్పాక' శకటం డిజైన్, ప్రదర్శన వెనుక కిరణ్ కుమార్ నిరంతర శ్రమ, సృజనాత్మకత దాగి ఉన్నాయని ప్రశంసించారు. సుదీర్ఘ సర్వీస్‌లో ఉంటూనే ఆయన నిరంతరం కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపేవారన్నారు. అందులో భాగంగానే లా , క్రిమినాలజీ వంటి మరెన్నో కోర్సులు చేస్తూ నిరంతరం తన నైపుణ్యాలను అప్‌స్కిల్లింగ్ చేసుకున్నారని డైరెక్టర్ గుర్తుచేశారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కుటుంబం కంటే పనికే మొదటి ప్రాధాన్యత ఇచ్చి, శాఖ ఉన్నతి కోసం ఆయన నిరంతరం శ్రమించారన్నారు. 33 ఏళ్లపాటు ఆయన అందించిన అద్భుతమైన సేవలు శాఖ చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. కిరణ్ కుమార్ లోని సినియారిటీ, సిన్సియారిటీని, మల్టీ టాస్కింగ్ నైపుణ్యాలను శాఖలోని యువ సిబ్బంది అందరూ అలవర్చుకోవాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు. అధికారిక బాధ్యతల నుండి విరమణ పొందుతున్న ఆయన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె. ఎస్ విశ్వనాథన్ తెలియజేశారు. పదవీ విరమణ చేస్తున్న అదనపు సంచాలకులు (ఇంచార్జి) పోతుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ... డెడికేషన్, డివోషన్, డిటర్మినేషన్ అనే త్రీడీ సూత్రాలతోనే తాను పనిచేశానని, పీఆర్వోలకు జర్నలిజం పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. బోధన, చట్టంపై ఆసక్తి ఉన్నా, అనుకోకుండా జర్నలిజం పూర్తి చేసి ఈ శాఖలోకి వచ్చానని.. ఇక్కడ పనిచేయడం వల్లే నలుగురు రాష్ట్రపతులు, ముగ్గురు ప్రధానమంత్రులను కలిసే అరుదైన అవకాశం దక్కిందని గుర్తుచేసుకున్నారు. పుట్టపర్తి వేడుకలు, పుష్కరాల వంటి సమయాల్లో వివిధ ప్రణాళికలతో ట్రాఫిక్, మీడియా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు వివరించారు. వైఎస్సార్ హయాంలో కేజీ బేసిన్ కేసు కోసం తన సేవలను ప్రత్యేకంగా ఉపయోగించుకున్నారన్నారు. విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమవ్వడం వల్ల కుటుంబానికి సమయం ఇవ్వలేకపోయానని, తండ్రిని కూడా కోల్పోవాల్సి వచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. తన విజయాలన్నీ టీమ్ వర్క్ వల్లే సాధ్యమయ్యాయన్నారు. శాఖలో 'పాసింగ్ క్లౌడ్' లా కాకుండా, వెళ్ళిన ప్రతిచోటా చెరగని ముద్ర వేసే 'రైనీ క్లౌడ్' లా ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఈ వింగ్‌ను నడపడానికి అందిపుచ్చుకునేలా ఉత్తమమైన వారు శాఖలో ఉన్నారన్నారు. పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేసినవారిలో జాయింట్ డైరెక్టర్లు ఐ. సూర్యచంద్రరావు, సీఐఈ ఓ. మధుసూధన, ఆర్ఐఈ కృష్ణా రెడ్డి, డాక్టర్ టి. నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్లు పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేశ్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, పి. రాజశేఖర్, డాక్టర్ కె. తిరుపాలయ్య, ఎస్వీ మోహన్ రావు, గణాంక విభాగం ఏవో పి. సుదర్శనరావు, జేఏవో ఎమ్. నాగరాజు, సీనియర్ పాత్రికేయులు, వివిధ జర్నలిస్ట్ సంఘాలు, పలువురు పబ్లిషర్స్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

## మాగంటి నాని టిడిపి యువ కెరటం



**విస్సన్నపేట,మే 29 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో టిడిపి పార్టీ ఆవిర్భావ సమయంలో మాగంటి శోభన ప్రసాద్ విశేష సేవలు అందించడం జరిగింది. ఆయన కుమారుడు తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని తండ్రిని మించిన తనయుడుగా మాగంటి సత్యనారాయణ చౌదరి అలియాస్ నాని తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల కుటుంబాలకు అండగా విద్యా వైద్య అవసరాలకు వివాహాది శుభకార్యాలకు తానున్నానని భరోసా ఇస్తూ పేదల పాలిట పెన్నిధిగా ఆర్థిక చేయూత అందిస్తూ నేటి యువతరానికి బ్రాండ్ అంబాసిడర్ గా నిలుస్తున్నారని సర్వత్రా వినిపిస్తుంది. బస్టాండ్ సెంటర్ లో విశ్వవిఖ్యాత నటసారభౌముడు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు దివంగత డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని భారీ కేకు కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించారు. ఎంత సంపాదించేది ముఖ్యం కాదని దయా కరుణ 10 మందికి ఉపయోగపడాలనే తపన చిన్నతనంలోనే రావడం అనేది ఆయన దయార్థ హృదయానికి దర్పణం అని ఆ దేవుని ఆశీస్సులతో సర్వకాల సర్వవస్థలందు అష్ట ఐశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఆయన కుటుంబం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నామని వారు తెలియజేశారు

## కుర్చీలు వితరణ

**-ఎన్టీఆర్ జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల రాధాకృష్ణ**




**విస్సన్నపేట,మే 29 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఆంధ్ర కేసరి మండల సమైక్య కార్యాలయం నకు నందేటి వెంకటేశ్వరరావు అలియాస్ బుజ్జి పది కుర్చీలు అందించినట్లు టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాధాకృష్ణ ఆంధ్ర కేసరి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాదెండ్ల నాగమణి ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం జమలయ్య, గ్రామ టిడిపి అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు గిరి రెడ్డి, రంగారావు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు కూలింగ్ వాటర్ యూనిట్ వితరణ

- మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు



**విస్సన్నపేట,మే 29 (వార్తాప్రభ) :** స్థానిక మండల డ్వాక్రా కార్యాలయంలో డ్వాక్రా అక్కచెల్లెమ్మల దాహార్తిని తీర్చేందుకు కూలింగ్ మినరల్ వాటర్ యూనిట్ ను టిడిపి యువ నాయకులు మాగంటి నాని( సత్యనారాయణ చౌదరి ) అందించినట్లు మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవే లక్ష్యంగా అడుగులు వేస్తున్న యువ నాయకుడు నానికి డ్వాక్రా అక్క చెల్లెమ్మలు ఆశీస్సులు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాదెళ్ల నాగమణి, గిరి రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు, సుధాకర్ వంశీ పలు డాక్రా సంఘాల వివోలు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవు

**: మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్**



**రౌతులపూడి,మే 29 (వార్తాప్రభ) :** జిల్లా కలెక్టర్, జిల్లా ఉప రవాణా కమిషనర్ ఆదేశాలు మేరకు నిబంధనలకు విరుద్ధంగా రౌతులపూడి మండలంలో ఎస్. పైడిపాల తదితర గ్రామాల నుండి బండరాయి,ఎర్ర మట్టి తరలించే లారీలపై మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పరిమితికు మించి అధిక బరువు,అలాగే టార్పాలిన్ కప్పని అదనంగా ఎల్ఈడీ లైట్లు అమర్చుకుంటున్న 19 లారీలపై కేసులు నమోదు చేసినట్లు కత్తిపూడి మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాస్ తెలిపారు. ఈ రెండు నెలల కాలంలో మొత్తం 52 కేసులు నమోదు చేసి అధిక లోడు వేసినందుకుగాను రూ.4 లక్షల 5వేలు,భద్రతా ప్రమాణాలు పాటించనందుకు రూ.1లక్ష 15వేలు జరినామ విధించడం జరిగిందని తెలిపారు.ఈ తనిఖీలు ఇక నిరంతరం కొనసాగుతాయని క్వారీ లారీల యజమానులు అందరూ కూడా పరిమితికి మించకుండా అలాగే రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆయన తెలిపారు.

## కుమ్మరిపాలెంలో విషాదం

- బైకుపై వస్తుండగా తాటిచెట్టు పడి ఇద్దరు మృతి





**కోడూరు,మే 29 (వార్తాప్రభ) :** కోడూరు మండలంలో కుమ్మరిపాలెం గ్రామంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. గురువారం రాత్రి భారీగా వీచిన ఈదురుగాలుల ప్రభావంతో తాడిచెట్టు విరిగి రోడ్డుపై వెళ్తున్న బైక్ పై పడింది. బైక్ పై ప్రయాణిస్తున్న గరికపాటి మనోహర్ బాబు (29), చూటూరు శివరామకృష్ణ (26) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీసిటీలో ముగిసిన వేసవి శిబిరం

- విజ్ఞానంతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని పొందామన్న విద్యార్థులు









**శ్రీసిటీ,మే 29 (వార్తాప్రభ) :** శ్రీసిటీ వేసవి శిబిరం (సమ్మర్ క్యాంపు) తమకు విజ్ఞానం, వివిధ అంశాలలో నైపుణ్య శిక్షణతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని పంచిందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. గత నెల 27న ఇరుగుళం జడ్పీ హైస్కూల్ లో ప్రారంభమైన వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక అకార్డ్ స్కూల్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ముగింపు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిబిరం పట్ల విద్యార్థులు తమ అభిప్రాయాలను, మధురానుభూతులను పంచుకున్నారు. తమ ప్రాంతంలో గతంలో ఇలాంటివి అందుబాటులో లేవని, ఉచిత భోజన, వాహన వసతితో పాటు చక్కని శిబిరం ఏర్పాటు చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 27 నుంచి మే 29 జరిగిన వేసవి శిబిరంలో 8,9, 10వ తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థులు 68 మంది హాజరు కాగా, 50 మంది చివరివరకు పాల్గొన్నారు. శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, వేదిక్ మ్యాథ్స్, బేసిక్ కంప్యూటర్ కోర్సు, వ్రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెళకువలు, హస్త కళలు అంశాలను బోధించారు. యోగా, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, మరికొన్ని క్రీడలలో తర్ఫీదు ఇచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్, ఇస్కాన్ ఆలయం క్షేత్ర పర్యటనలు మరియు శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. స్థానిక అపోలో హెల్త్ కేర్ సెంటర్, శంకర నేత్రాలయ , కేర్ డెంటల్ వారిచే జనరల్ హెల్త్, నేత్ర, పంటి వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి వివిధ కోర్సులతో ఈ కార్యక్రమాన్ని రూపొందించి మార్గనిర్దేశం చేశారు. వేసవి సెలవులను వృధా చేయకుండా గ్రామీణ విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, నైపుణ్య శిక్షణ అందించాలన్న లక్ష్యంతో వరుసగా రెండవ ఏడాది ఏర్పాటు చేసిన వేసవి శిబిరం విజయవంతం కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మరిన్ని వినూత్న కోర్సులతో ప్రతిఏడాది వేసవి శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం శ్రీసిటీ పరిసర ప్రాంతాల విద్యాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యంతో శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పరిసర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావసతులు మెరుగు పరిచామన్న ఆమె, దీనిని నిరంతరంగా కొనసాగిస్తామని చెప్పారు. అధ్యాపక బృందం రంజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), సౌమ్య మరియు సాయి లక్ష్మి (ఇంగ్లీష్), చెంచయ్య (కంప్యూటర్స్, మ్యాథ్స్), కోదండం (యోగా), మురళి (క్రీడలు) వేసవి శిబిరం శిక్షకులుగా వ్యవహరించారు. ముగింపు వేడుకలలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలాగే ఆటపాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన రంజిత రమేష్ కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాండెలెజ్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు క్యాడ్బరీ చాక్లెట్లను పంచిపెట్టారు. శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ఇన్ లైన్ క్లోరినేషన్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం





**విస్సన్నపేట,మే 29 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిధిలో అందరికీ ఎల్లప్పుడూ సురక్షితమైన నీరు అనే నినాదంతో ఇన్ లైన్ క్లోరినేషన్ ( ఐ ఎల్ సి ) పై మండల స్థాయి అవగాహన మరియు శిక్షణా కార్యక్రమం గురించి ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని ఇలా అడ్వైజర్స్ , ఎవిడెన్స్ యాక్షన్ యొక్క భారత సాంకేతిక భాగస్వామి, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ ( ఆర్డబ్ల్యూఎస్ )లతో కలిసి జల్ జీవన్ మిషన్ పరిధిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంక్షేమ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు మొత్తం సుమారు 70 మంది పాల్గొనడంతో గ్రామ స్థాయిలో విస్తృత భాగస్వామ్యం నమోదైంది అని ఎంపీడీవో చెప్పారు. అందరి సంయుక్త కార్యాచరణతో గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ శుభ్రమైన సురక్షితమైన క్లోరిన్ కలిపిన నీరు అందేలా కృషి చేస్తామని సంకల్పం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇలా అడ్వైజర్స్ శిక్షణ కార్యక్రమంలో ఐ ఎల్ సి టాబ్లెట్ బేస్డ్ డోజర్ ( టిబి డి ) పరికరం పనితీరు, గ్రామ స్థాయిలో తాగునీటిని శుద్ధి చేయడంలో దాని పాత్రను వివరించారు. క్లోరిన్ కలిపిన నీటి పై ఉన్న అపోహలను ఎలా నివృత్తి చేయాలో కూడా చెప్పారు. అదనంగా గ్రామ పంచాయతీ సిబ్బంది రోజువారీగా పరికరాన్ని పర్యవేక్షించడం నీటి నాణ్యతను తనిఖీ చేయడం మరియు ప్రతి ఇంటికి సురక్షితమైన నీరు అందేలా చూడడంలో తీసుకోవలసిన బాధ్యతల గురించి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, డిప్యూటీ ఎంపీడీవో రామమోహన్, ఏవో ప్రసాద్, విస్సన్నపేట ఈవో హరికృష్ణ కుమార్ పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామపురం తండాలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు





**మైలవరం,మే 29 (వార్తాప్రభ) :** మైలవరం మండల పరిధిలోని సీతారామపురం తండా గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం ప్రారంభించారు. తండా వాసులకు సురక్షిత తాగునీరు సరఫరా నిమిత్తం కె.ఎల్ యూనివర్సిటీ యాజమాన్యం ఆర్వో యూనిట్ ఎక్విప్ మెంట్స్ అందించగా, గ్రామపంచాయతీ నిధులతో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయింది.1000 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకుతో గ్రామంలో 122 కుటుంబాలకు సురక్షిత నీటిని అందించనున్నారు.ఈ ఆర్వో ప్లాంట్ నిర్వహణ భాద్యతలు పూర్తిగా గ్రామ పంచాయితీ అధికారులు చూసుకుంటారు. ఫ్లోరైడ్ రహిత స్వచ్ఛమైన తాగునీరు అందరి హక్కు అని, కూటమి ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చా రు.గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి మౌనిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి చందా ఉదయ్ కుమార్,స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తు లు, మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి..



**గిద్దలూరు,మే 29 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లాకు నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించబడిన సామా సుబ్బారావు శుక్రవారం నాడు స్థానిక నారాయణ టెక్నో స్కూల్ నందు ఏర్పాటు చేసిన విద్యాసమీక్ష కార్యక్రమానికి హాజరైన సందర్భంగా గిద్దలూరు డివిజన్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వం స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేసి ఘన సన్మానం చేశారు.అనంతరం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి.పిచ్చయ్య డీఈవో ను కోరారు.ఉపాధ్యాయ సమస్యల పరి ష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని ఆయన చెప్పినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి మాధవి దేవి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఆవుల రాజు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య,సీనియర్ నాయకులు జయచంద్రా రెడ్డి, గిద్దలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, రాచర్ల మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రఘురాం, రంగారెడ్డి, కొమరోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్, మురళీధర్ రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాసరెడ్డి, హరి ప్రసాద్, జిల్లా కౌన్సిలర్స్ వెంకటేశ్వరరెడ్డి, ఈ వెంకటేశ్వర్లు మరియు సభ్యులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# జూన్ 1వ కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి - సి.పి.ఐ.జిల్లా కార్యదర్శి ఓ రమణ

**రాజాం, మే 29 (వార్తాప్రభ) :** జూన్ 1వ విజయనగరం కలెక్టరేట్ వద్ద రైతులతో ధర్నా చేపడుతున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ అన్నారు. శుక్రవారం రాజాం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ?రాష్ట్రంలో జూన్ ఒకటో తేదీ నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతోంది. దుక్కులు దున్ని, విత్తనాలు వేసి కొత్త ఆశలతో సాగుకు సిద్ధమవ్వాల్సిన రైతాంగం నేడు గుండె నిండా ఆవేదనతో, అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతోంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయో లేదో తెలియని వాతావరణ పరిస్థితులు ఒకవైపు, అస్తవ్యస్తంగా మారిన సాగునీటి రంగా వనరులు మరోవైపు అన్నదాతను భయపెడుతున్నాయి. వీటన్నింటికీ తోడు, గడిచిన రబీ పంటల కొనుగోలులో ప్రభుత్వం ప్రదర్శించిన ఉదాసీనత, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు వ్యవసాయాన్ని ఒక గుదిబండగా మార్చేశాయి. ఖరీఫ్ ముంగిట నిలిచిన రైతులకు అండగా నిలవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం తీవ్ర ఆందోళనకరం. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రాజెక్టుల కింద ఉన్న కాలువల్లో కనీసం పూడికలు తీయలేదు. తూటికాడ, గుర్రపుడెక్క, ముళ్ల కంపలు విపరీతంగా పెరిగిపోయి కాలువలు కాస్తా అడవులను తలపిస్తున్నాయి. గేట్లు తుప్పు పట్టి దెబ్బతిన్నా పట్టించుకునే నాథుడే లేడు. వందల సంఖ్యలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల) పథకాలు మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు తప్పవని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా, ప్రభుత్వ అధికారుల్లో ఎలాంటి ముందస్తు కార్యాచరణ లేకపోవడం అత్యంత బాధాకరం. రబీ సీజన్‌లో పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పులపాలయ్యారు.ధాన్యం ముక్కవుతుందని క్వింటాకు 5కేజీల ధాన్యం అదనంగా మిల్లర్లు కాజేశారు. లక్షలాది ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తే ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. పొగాకు కంపెనీలు సిండికేట్‌గా మారి పొగాకు రైతుల కష్టార్జితాన్ని దోచుకు తింటుంటే నిమ్మకు నేరెత్తినట్టుగా వ్యవహారిస్తోంది. కోకో రైతుల గోడు వినేవారే లేరు. జీడిమామిడి, మామిడి రైతుల పరిస్థితి అంధకారంలో పడింది. రాయలసీమలో, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో తెగుళ్లు, నీటి ఎద్దడి వల్ల ఎండిపోతున్న చీనీ, దానిమ్మ తోటలను చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. “రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లు”, రైతులు ఇంతగా నష్టపోతున్నా పాలకులు ఉత్సవాల్లో మునిగితేలడం శోచనీయం.

**విత్తన కల్తీ, ఎరువుల ధరల భారం..** పెరుగుతున్న విత్తనాల ధరలను అదుపు చేసే యంత్రాంగమే లేదు. మార్కెట్లో కల్తీ, నాసిరకం, నిషేధిత (గ్లైసెల్ పత్తి వంటి) విత్తనాలు విచ్చలవిడిగా అమ్ముతున్నారు. నిఘా సంస్థలు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నాయి. మరోవైపు, అంతర్జాతీయ పరిస్థితుల సాకుతో ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయి. 50 కేజీల కాంప్లెక్స్ ఎరువుల బస్తాపై రూ. 300 నుండి రూ. 450 వరకు భారం పెరిగింది. వీటికి తోడు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ల అద్దెలు, సాగు ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి కోత పెట్టడం, భవిష్యత్తులో సబ్సిడీని పూర్తిగా తగ్గించి నగదు బదిలీ పెట్టాలనే ఆలోచనలు సాగును మరింత భారంగా మారుస్తున్నాయి. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ‘స్కేల్ ఆఫ్ ఫైనాన్స్’ ప్రకారం బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలన్నా రూ. 2 లక్షలు దాటితే వ్యక్తిగత షూరిటీలు, పత్రాలు అడగడం విడ్డూరంగా ఉంది. ఇక వాస్తవంగా సాగు చేసే కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. వారికి గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను సులభతరం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విస్మరించింది. బ్యాంక్ రుణాలు అందక కౌలు రైతులు నూటికి రూ. 5ల వడ్డీకి ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి అప్పుల్లో కూరుకుపోతున్నారు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతు కుటుంబాలకు అందాల్సిన ఎక్స్‌గ్రేషియా చెల్లింపుల్లోనూ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. తీరప్రాంతంలో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఆక్వా కల్చర్ తీవ్ర సంక్షోభంలో ఉంది. రొయ్యల మేత ధరలను టన్నుకు రూ. 12,000 నుండి రూ. 20,000 వరకు పెంచేసినా ప్రభుత్వం కంపెనీలను గట్టిగా నిలదీయలేకపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు పడిపోవడంతో ఆక్వా రైతులు అటు పెట్టుబడి పెరిగి, ఇటు ధర లేక రెండు వైపులా నష్టపోతున్నారు.



ఖరీఫ్ సీజన్ విజయవంతం కావాలన్నా, రైతుల ఆత్మహత్యలు ఆగాలన్నా ప్రభుత్వం తక్షణమే కొన్ని నిర్దిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను, పచ్చిరొట్ట విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలి. కల్తీ, లూజ్, నిషేధిత విత్తనాలు అమ్మే వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలి. ఎరువుల సబ్సిడీని పెంచాలి.పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి. యూరియా, కాంప్లెక్స్ ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా సకాలంలో అందుబాటులో ఉంచాలి. పెరుగుతున్న సాగు ఖర్చులను పరిగణలోకి తీసుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలి. కౌలు రైతులకు సులభంగా గుర్తింపు కార్డులు ఇచ్చి నయాపైసా వడ్డీ లేకుండా పంట రుణాలు అందించాలి.గతంలో తీసుకున్న పంట రుణాలను రూ.2లక్షల వరకు తక్షణమే మాఫీ చేయాలి. ప్రస్తుత సాగు ఖర్చులను బట్టి ‘అన్నదాత సుఖీభవ’ పథకం కింద ఇచ్చే సాయాన్ని రూ. 20,000 నుండి రూ. 50,000 వరకు పెంచాలి, భూమి లేని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలి. క్వింటా పొగాకును నాణ్యతను బట్టి రూ. 36,000 నుండి రూ. 45,000 వరకు కొనుగోలు చేసేలా కంపెనీలపై ఒత్తిడి తేవాలి. ఉద్యాన పంటలైన మామిడి (తోతాపురి టన్నుకు రూ. 18,000, బంగినపల్లికి రూ. 25,000), జీడిమామిడి(80 కేజీల బస్తా రూ.16వేలు) కోకో (కిలో గింజలు కనీసం రూ.1100)తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. దెబ్బతిన్న చీనీ, దానిమ్మ తోటలకు ఎకరానికి రూ. 5 లక్షల నష్టపరిహారం అందించాలి. రొయ్యల మేత ధరలను తగ్గించి, మద్దతు ధర ప్రకటించాలి. జోన్, నాన్-జోన్ పరిమితులు లేకుండా ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50 లకే అందించాలి. ముఖ్యంగా ఖరీఫ్ కు నీటి విడుదల లోపు యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టుల కాలువల పూడికలు తీయించి, తుప్పుపట్టిన గేట్లను మార్చాలి. మూలనపడ్డ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను బాగు చేయాలి. వ్యవసాయం దండగ కాదు పండగ కావాలన్నది పాలకుల నినాదం మాత్రమే కాకూడదు అది రైతుల జీవితాల్లో నిజం కావాలి. కంటిముందు ఖరీఫ్ సీజన్ సాక్షాత్కరిస్తున్న వేళ, ప్రభుత్వం తన ఉదాసీనతను వీడాలి. కేవలం ప్రచారాలకో, ఉత్సవాలకో పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలు, అవసరాలను స్వీకరించి, పైన పేర్కొన్న డిమాండ్లను నెరవేర్చాలి. అప్పుడే అన్నదాతకు నిజమైన ‘ప్రభుత్వ భరోసా’ లభిస్తుంది, దేశానికి వెన్నెముకైన రైతు ఆత్మవిశ్వాసంతో నాగలి పట్టగలరని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, రాజాశీ నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్ పాల్గొన్నారు.

బి.జె.పి. నాయకులు రాధాక్రిష్ణ యాదవ్ కు జన్మ దిన మరియు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన

## బి.జె.పి.నేత రవి కుమార్



**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):**రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు, మాదాపూర్ డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణ యాదవ్ జన్మదినం మరియు వివాహ వార్షికోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని వారి నివాసంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్,గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగల రాధాకృష్ణ యాదవ్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవలు అందిస్తూ కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ప్రజాసేవలో నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను చేరుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని,పార్టీకి ఆయన చేస్తున్న కృషి భవిష్యత్తులో మరింత ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివసింగ్, వరలక్ష్మీ ధీరజ్,సీనియర్ నాయకులు సుమన్,శ్రీధర్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చీఫ్ తో అసెంబ్లీ స్పీకర్, కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్



**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):**తెలంగాణ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ ప్రక్షాళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.రానున్న పట్టణ స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది.ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి తరతరాలుగా సేవలందిస్తున్న మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం అంశాలపై రాహుల్ గాంధీ అనిల్ కుమార్ యాదవ్‌తో చర్చించినట్లు సమాచారం. అలాగే స్వర్గీయ మరబోయిన సత్యనారాయణ యాదవ్ పార్టీకి అందించిన సేవలను కూడా ఆయన వివరించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ రాజకీయ పరిణామాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు కూడా ప్రత్యేకంగా గమనిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.రాహుల్ గాంధీని కలవడం ఎంతో ఆనందంగా ఉందని,పార్టీ కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు.ఈ భేటీకి సహకరించిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పొగాకు ఉత్పత్తులకు దూరంగా మంచి అలవాట్లు తో యువత ఉన్నతంగా ఎదగాలి.

**సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏం.లక్ష్మ రెడ్డి**



**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యం లో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే గోడ పత్రికను ఆవిష్కరించారు. గచ్చిబౌలి మహిళలు మరియు పిల్లల భద్రతా విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు,పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన ఊపిరితిత్తుల,గుండె సంబంధిత వ్యాధులు,క్యాన్సర్ వంటి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.ముఖ్యంగా యువత ధూమపానానికి ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తోందని,ఈ ఏడాది "నికోటిన్ మరియు పొగాకు వ్యసనాన్ని ఎదుర్కోవాలి" అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి యోగా,ధ్యానం, పౌష్టికాహారం వంటి మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు.సంకల్పబలం ఉంటే ధూమపానం వంటి దురలవాట్లను మానుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీహరిబాబు,కోటేశ్వరరావు,అమ్మయ్య చౌదరి,జి.వి.రావు, సత్యనారాయణ,వాణీ సాంబశివరావు,పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు

## లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దని కొనుగోలు చేయాలి రైతులు- ఏవో జి నర్మద



**భద్రాద్రి కొత్తగూడెం మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,రైతులకి అందుబాటులో విత్తనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారి ఏవో జి నర్మదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులు విత్తనాలు తీసుకున్నపుడు బిల్లు డీలర్ దగ్గర నుండి తప్పనిసరిగా తీసుకోవాలని గుడ్డ సంచులలో గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు నకిలీ విత్తనాలు అమ్మితే రైతులు మా దృష్టికి తీసుకురావాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు

# సంక్షోభంపై భారత్ గెలుపు!!

● 7.3% వృద్ధితో సరికొత్త రికార్డు ● ప్రపంచం వణికినా.. భారత్ ఆగదు ● ప్రగతి పథంలో నవ భారతం ● ఆర్థిక తుపానులోనూ అచంచల విశ్వాసం ● భారత్ అద్భుత ప్రస్థానం ● మోదీ మార్క్ వృద్ధి ● దేశీయ గిరాకీ, వ్యవసాయం, సేవా రంగాల పటిష్టత ● కోట్లాది భారతీయుల ఆకాంక్షలకు ఆర్థిక ప్రగతి నిదర్శనం ● ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న భారత ఆర్థిక వ్యవస్థ







**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 29 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు, సవాళ్లు వెంటాడుతున్నప్పటికీ, భారత్ మాత్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం, దేశం త్రైమాసికంలో 7.3% ఆర్థిక వృద్ధిని సాధించి, సంక్షోభాన్ని తట్టుకొని బలంగా నిలబడింది. ఈ అసాధారణ ప్రగతి దేశీయ గిరాకీ, వ్యవసాయం, సేవా రంగాల పటిష్టతకు నిదర్శనం.ప్రపంచ మార్కెట్లు మాంద్యం భయాలతో వణికిపోతున్న వేళ, చమురు సంక్షోభం, ద్రవ్యోల్బణం వంటి పెను సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, భారత్ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, వేగంగా ముందుకు సాగుతోంది. ఇది కేవలం సంఖ్యల గారడీ కాదు, కోట్లాది మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, కష్టానికి ప్రతీక. రైతన్నల శ్రమ, పరిశ్రమల పురోగతి, సేవా రంగాల విస్తరణ ఈ వృద్ధికి వెన్నెముకగా నిలిచాయి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, దేశీయ గిరాకీ ఊపందుకోవడంతో ఆర్థిక చక్రం మరింత వేగంగా తిరుగుతోంది.ఒకప్పుడు సాధారణ పరిస్థితుల్లోనూ దేశాన్ని అంధకారంలోకి నెట్టిన పాలనను చూసిన భారత్, నేడు ప్రపంచ సంక్షోభంలోనూ వృద్ధి పథంలో దూసుకుపోవడం విశేషం. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, పటిష్టమైన ఆర్థిక విధానాలు ఈ అద్భుత ప్రగతికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటూ, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న మోదీ పాలన, గత పాలకుల నిర్లక్ష్యానికి పూర్తి భిన్నంగా నిలుస్తోంది.ఈ వృద్ధి కేవలం ఆర్థిక సంఖ్యలకే పరిమితం కాదు. ఇది ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న నవ భారతానికి ప్రతీక. ప్రతి భారతీయుడి ముఖంలో చిరునవ్వును చూసేందుకు, దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు జరుగుతున్న నిరంతర కృషికి ఇది నిదర్శనం. సంక్షోభాలను అధిగమించి, సుస్థిర వృద్ధిని సాధిస్తున్న భారత్ ప్రస్థానం, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుంది అనడంలో సందేహం లేదు.

# కలెక్టర్ సుడిగాలి తనిఖీలు!!

● రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి ● రైతుల ధాన్యంపై కట్టింగ్ పెడితే చర్యలు తప్పవు ● ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వసతులు మెరుగు పరచండి ● కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 29 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గౌతమి నగర్‌లోని రైస్ మిల్లులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, సమయం ముగిసిందనే కారణంతో ఒక్క రోగిని కూడా వెనక్కి పంపొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే అందించాలని అధికారులను సూచించారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గైనకాలజీ ఓపీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శారదనగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఇంటర్మీడియట్ ఫలితాలు, అడ్మిషన్లు, స్టడీ రూమ్ సౌకర్యాలు తదితర అంశాలపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మరింత మెరుగైన వసతులు కల్పించే దిశగా అవసరమైన పరికరాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తర్వాత గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన కలెక్టర్ రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్ విధించరాదని మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. లారీలను సమయానికి దించుకొని రైతులు ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సుడిగాలి పర్యటనలో డాక్టర్లు అరుణ, కృపాభాయి, రాజు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# సింగరేణి సీఎండీ విస్తృత పర్యటన!!

● ఉత్పత్తి, భద్రత, కార్మిక సంక్షేమంపై సమీక్ష ● జీడీకే-11 గనిలో మ్యాన్ రైడింగ్ వ్యవస్థ ప్రారంభం ● కార్మికులకు సురక్షిత, వేగవంతమైన రవాణా సౌకర్యం ● ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషి చేయాలి ● సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి







**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 29 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి రామగుండం-1 ఏరియాలో విస్తృతంగా పర్యటించి గనుల ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. జీడీకే-11 ఇంక్లైన్ గనిలో ఉద్యోగులు, కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి బొగ్గు ఉత్పత్తి పెంపు, నాణ్యత, ఉత్పాదకత అలాగే భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. సింగరేణి సంస్థ క్రమశిక్షణ, సమిష్టి పనితత్వంతో ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా గనిలో ఏర్పాటు చేసిన ఐదవ మ్యాన్ రైడింగ్ వ్యవస్థను ప్రారంభించి కార్మికులు సురక్షితంగా, వేగంగా పని ప్రదేశాలకు చేరుకునేలా ఈ సౌకర్యం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను సన్మానించి అభినందించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ జీడీకే-11 గని అత్యధిక యాంత్రీకరణ కలిగిన రెండవ అతిపెద్ద గని అని తెలిపారు. డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు గని ఉత్పత్తిని భవిష్యత్తులో పదిహేను లక్షల టన్నులకు పెంచే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. అనంతరం సీఎండీ జీడీకే-5 ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి, రవాణా, యంత్రాల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. తరువాత జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అందిస్తున్న క్రీడా సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉత్పత్తి లక్ష్యాలు, భద్రతా ప్రమాణాలు, వ్యయ నియంత్రణ, నాణ్యత అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేలో రైతులుపంట వ్యర్థాలను కాల్చొద్దు - ఏవో నర్మద

**భద్రాద్రి కొత్తగూడెం మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,రైతులు తమ పంట చేలలోని వ్యర్థాలను కాల్చవదని అలాచేస్తే భారీ జరిమానా విధించబడుతుందని మండల వ్యవసాయ అధికారి జి. నర్మద శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. వానకాలం సాగుకు భూములను సిద్ధం చేస్తున్న అన్నదాతలు వరి కొయ్యలను , మొక్కజొన్న చొప్పలను చేలల్లో తగలబెట్టవద్దని నిప్పు అంటించడం వల్ల భూసారం దెబ్బతింటుందని , సేద్యపు భూమిలోని సూక్ష్మ జీవులు మరణిస్తాయని అన్నారు. పర్యావరణ కాలుష్యం కూడా మరింత పెరుగుతుందన్నారు... పంట అవశేషాలను చెలోనే కలియదున్నాలని సూచించారు.



వార్తా ప్రభ

# హైదరాబాద్

## ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత!!

**జల సంరక్షణే లక్ష్యం**

**భూగర్భ జలాల పెంపునకు ప్రజలందరూ సహకరించాలి**

**రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ**



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 29 (వార్తాప్రభ ప్రతినిధి)** 38వ డివిజన్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ, డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము ఆధ్వర్యంలో శుక్రవారం ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని వారు సూచించారు. వర్షాకాలంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల ఆవశ్యకతను తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి, భూగర్భ జల మట్టాలను పెంచవచ్చని, తద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం ప్రజలలో నీటి సంరక్షణపై అవగాహన కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ఇంకుడు గుంతల నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలు స్థానిక పర్యావరణ పరిరక్షణకు, నీటి వనరుల సుస్థిరతకు దోహదపడతాయని అధికారులు వివరించారు. ఈ పర్యటన ద్వారా ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంలో అధికారులు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నవీన్, వార్డ్ ఆఫీసర్ సాయి కృష్ణ, మాజీ కార్పొరేటర్ బొమ్మక రాజేష్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ హత్య చేసుకున్న గుర్తు తెలియని మహిళ



**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):**మాదాపూర్ పరిధిలోని దుర్గం చెరువులో ఓ గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది.శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో మహిళ చెరువులో దూకినట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు.హైడ్రా సిబ్బంది సహాయంతో దుర్గం చెరువులో గాలింపు చేపట్టగా ఓ మహిళ మృతదేహం లభ్యమైంది.మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.మృతురాలు చామనచాయ రంగులో ఉండి,నలుపు రంగు వెంట్రుకలు కలిగి ఉందని పేర్కొన్నారు. ఆమె నలుపు రంగు చుడిదార్,క్రీమ్ రంగు లెగ్గిన్ ధరించి ఉన్నట్లు గుర్తించారు.మృతురాలి ఆచూకీ తెలిసిన వారు వెంటనే మాదాపూర్ పోలీస్ స్టేషన్ సెల్ నంబర్ 8712663109 లేదా మాధాపూర్ ఎస్‌హెచ్‌వో డి. కృష్ణమోహన్ సెల్ నంబర్ 8712663100 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కుంటుంది

**-గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ ఆందోళన**



**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి,మే 29 (వార్తాప్రభ):నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీ కండల రెసిడెన్సీలో గురువారం నిర్వహించిన కార్యనిర్వాహక వర్గ సమావేశంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మె, పెరుగుతున్న మెటీరియల్ ధరలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు.అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో రేట్లు పెంచాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. సమ్మె కారణంగా చిన్న బిల్డర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అధ్యక్షుడు కె. రాజారెడ్డి మాట్లాడుతూ యుద్ధాల ప్రభావంతో నిర్మాణ సామగ్రి ధరలు పెరిగి రంగం కుదేలైందన్నారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్ ఎస్‌ఎఫ్‌టీ రేట్లు పెంచకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.జనరల్ సెక్రటరీ పి.బి.ఎస్. విశ్వనాథ్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో జాప్యం వల్ల బిల్డర్లు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టెక్నికల్ అడ్వైజర్ సుమా రామకృష్ణ లేబర్ సెస్ ద్వారా సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని కోరారు.ఈ ఈ కార్యక్రమంలో పులి మురళి,ఉపేందర్ రెడ్డి,చక్రపాణి,వాసుదేవరావు, రామకృష్ణ, విజయ ప్రతాపరెడ్డి,కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని తరిమి కొడదాం

**జగిత్యాల, మే 29 (వార్తాప్రభ):**:క్షయ వ్యాధిని తరిమి కొడదాం ఆనిడిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి జగిత్యాలలో క్షయ వ్యాధి పై వైద్య శిబిరం నిర్వహించారు.

# సంపాదకీయం

## ప్రపంచ రాజకీయ చరిత్రలో తొలిసారి.. హైబ్రిడ్ మహానాడు

అవకాశాల్ని అందిపుచ్చుకోవటం అందరికి సాధ్యమయ్యేది కాదు. కొందరు మాత్రమే ఆ పని చేయగలుగుతారు. పని ఏదైనా దాన్ని రోటీన్ కు భిన్నంగా చేయటం అంత ఆషామాషీ కాదు. తూతూ మంత్రంగా కాకుండా.. కమిట్ మెంట్ తో చేస్తే.. సరికొత్త చరిత్రను క్రియేట్ చేసే అవకాశం లభిస్తుంది. తాజాగా ఏపీ అధికారపక్షం తెలుగుదేశం పార్టీ అలాంటి పనినే చేసింది. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పార్టీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటుందన్న సంగతి తెలిసిందే. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. మహానాడు కార్యక్రమాన్ని వీలైనంత భారీగా నిర్వహించటం తెలుగుదేశం పార్టీకి అలవాటు.దాన్నో రాజకీయ సమావేశంగా కాకుండా.. పార్టీ విధానాలు రూపొందించే అత్యున్నత వేదికగా పని చేసేలా డిజైన్ చేయటం కనిపిస్తుంది. పరిస్థితులకు అనుగుణంగా ఎన్టీఆర్ పుట్టినరోజైన మే 28తో ముగిసేలా దీన్ని డిజైన్ చేస్తారు. మహానాడు ఆఖరి రోజున పార్టీ రాజకీయ తీర్మానాలను ఆమోదిస్తారు. అదే సమయంలో పార్టీకి వచ్చిన ఆదాయం.. ఖర్చులకు సంబంధించిన వివరాల్ని వెల్లడించటం కనిపిస్తుంది. ఈ మహానాడులో ప్రత్యేకత ఏమంటే.. పార్టీ అత్యుత్తమ నాయకత్వం మొదలు గ్రామీణ స్థాయి సాధారణ కార్యకర్త వరకు ఇందులో పాలుపంచుకునే అవకాశాన్ని కల్పిస్తారు.ఈ ఏడాది నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఇంధన పొదుపు గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని డిసైడ్ చేశారు. అందుకు తగ్గట్లే భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి ఇలాంటి హైబ్రిడ్ విధానంలో రాజకీయ పార్టీ నిర్వహించే కార్యక్రమాలు తూతూ మంత్రంగా లేదంటే ఒక మొస్తరుగా మాత్రమే నిర్వహించే వీలు ఉంటుంది. అందుకు భిన్నంగా.. దీన్నో అవకాశంగా తీసుకొని.. రోటీన్ గా నిర్వహించే మహానాడుకు మించి.. క్యాడర్ లో సరికొత్త జోష్ ను నింపేలా ప్లాన్ చేసిన తీరు ఇప్పుడు కొత్త చరిత్రకు కారణమైంది.ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ప్రపంచంలో మరే రాజకీయ పార్టీ కూడా హైబ్రిడ్ విధానంలో ఇంతటి భారీ రాజకీయ సదస్సును నిర్వహించిన దాఖలాలు లేవు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఒకే సమయంలో లక్షలాది మంది కలిసి కార్యక్రమాన్ని నిర్వహించుకోవటం.. అది కూడా ఏకపక్ష ప్రసంగంగా మాదిరి కాకుండా.. కేంద్ర కార్యాలయంలోని నేతలతో వివిధ క్లస్టర్లలోని కార్యకర్తలు ప్రత్యక్షంగా మాట్లాడేలా దీన్ని డిజైన్ చేయటం ఒక ప్రత్యేకతగా చెప్పాలి. ఏపీ వ్యాప్తంగా మొత్తం 1875 క్లస్టర్ కేంద్రాల్లో ఎల్ ఈడీ స్క్రీన్లు.. స్పీకర్ల ద్వారా ఏకకాలంలో లక్షలాది మంది ఒకేచోట పండుగ మాదిరి రాజకీయ సదస్సును నిర్వహించుకోవటం ఇదే తొలిసారి.నిజానికి ఈ హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడు ఎలాంటి ఫలితాల్ని ఇస్తుందన్న సందేహం పార్టీ పెద్దల్లో ఒకలాంటి ఆందోళన వ్యక్తమైంది. అయితే..దీన్ని పటాపంచలు చేస్తూ.. కిందిస్థాయి నేతలు మొదలు కార్యకర్తలు ఉత్సాహంతో ముందుకు రావటంతో.. హైబ్రిడ్ మహానాడుకు ఏకంగా 24.50 లక్షల మంది హాజరై సరికొత్త రికార్డును క్రియేట్ చేశారు. ఈ స్పందన పార్టీ నాయకత్వాన్నే ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పాలి.ఇంత పెద్దఎత్తున ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన హైబ్రిడ్ విధానానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా చెబుతున్నారు. ఈ తరహాలో రాజకీయ సదస్సును గతంలో కొందరు ట్రై చేసినా.. ఇంత భారీ ఎత్తున నిర్వహించటం ఇదే తొలిసారిగా చెబుతున్నారు. బహామాస్ కు చెందిన ఫ్రీ నేషనల్ మూవ్ మెంట్ పార్టీ 2022లో తమ దేశ వ్యాప్త ప్రతినిధుల కోసం తమ మొదటి హైబ్రిడ్ కాంక్లేవ్ ను నిర్వహించింది. అయితే.. అది కేవలం కొంతమంది డెలిగేట్లతో ఇంటర్నల్ సమావేశం మాత్రమే. ఇంత భారీ ఎత్తున నిర్వహించింది లేదు.కొవిడ్ సమయంలో అమెరికాలోని నాటి అధికార డెమొక్రాటిక్.. విపక్ష రిపబ్లికన్ పార్టీలు తమ జాతీయ కన్వెన్షన్లను వర్చువల్.. హైబ్రిడ్ పద్ధతిలో జరిపాయి కానీ.. ఇంత భారీ ఎత్తున మాత్రం కాదు. అదే సమయంలో మన దేశంలో బీజేపీ.. వైసీపీలు వర్చువల్ ర్యాలీలు.. ఆన్ లైన్ సమావేశాలు నిర్వహించాయి. కానీ.. పొదుపు చర్యల్లో బాగంగా గ్రామస్థాయి వరకు డిజిటల్ కేంద్రాల్ని ఏర్పాటు చేసి.. లక్షలాది మందిని ఒకే సమయంలో ఒకేచోటు కలిపేలా హైబ్రిడ్ వార్షిక మహోత్సవానికి మాత్రం తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది.

## ఎర్ర రామారావు వర్ధంతి కి ఘన నివాళు లు అర్పించిన తెలుగు తమ్ముళ్లు



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన దివంగత ఎర్ర రామారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా చిట్టి నగర్ కుండలం మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నూర్ భాషా కార్పోరేషన్ చైర్మన్ కె నాగుల్ మీరా పాల్గొని రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామారావు పార్టీకి తన శక్తికి మించి కృషి చేసేవాడని ఇటువంటి కార్యకర్తల శ్రమతోనే ఈరోజు పార్టీ అధికారంలో ఉందని నేడు వారు లేని లోటు పార్టీకి తీరనిది అన్నారు. తదనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అలాగే నమ్మి భాను ప్రకాష్ యాదవ్ మాట్లాడుతూ వారి ఇరువురి పరిచయం పార్టీలోనే ఏర్పడిందని నిరంతరం పార్టీ కోసమే మాట్లాడుతుండేవాడని పార్టీ అంటే ఒక కుటుంబంగా భావించే తెలుగుదేశం పార్టీ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు స్పూర్తితో శుక్రవారం తెదేపా పార్టీ కుటుంబ సభ్యుడు ఎర్ర రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది కి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు. దారా సైదులు, పరిశ పోగు రాజేష్, సారేపల్లి రాధా కృష్ణ, బేవర సాయి సుధాకర్, సగరు పిల్ల రమేష్, తమ్మిన శేఖరు, బోరా కనకారావు, గట్టిపాటి కిరణ్, మల్లెపు రాజు,పైలా నరసింహారావు,కంబాల దుర్గారావు, భాషా భాయ్ ,మరిపిల్ల దుర్గారావు, ఎస్ కే జిలాని, తదితరులు పాల్గొన్నారు.

# “పల్మనరి ఎంబాలిజంకు గురైన వారిని అత్యవసర చికిత్సతో ప్రాణాలను కాపాడవచ్చు”



**గుంటూరు టౌన్ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రోడ్డు ప్రమాదాలకు గురై అనేక ఎముకలు విరిగిన వారిలోనూ, వివిధ ఎముకలు, కీళు ,,మెదడు, వెన్నెముక తదితర చికిత్సల అనంతరం కదలికలు లేని వారిలో పల్మనరీ ఎంబాలిజం ప్రాణాంతకంగా పరిణమిస్తున్నదని అమృత హాస్పిటల్స్ మత్తు , ఇంటెన్సివ్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం సాయంత్రం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ , ఐ ఎస్ సి సి ఎం సంయుక్త ఆధ్వర్యంలో జి ఎం ఏ హాల్లో వైద్యులకు నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొని ప్రసంగించారు .కార్యక్రమానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ లక్ష్మీప్రసన్న ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఐసీయూలో దీర్ఘకాలంగా శారీరక కదలికలు లేని వారిలోనూ, రక్తనాళాలలో రక్తపు గడ్డల (డీప్ వేయిన్ త్రంబోసిస్) తో బాధపడుతున్న వారిలోనూ, ఎముకలు ,మెదడు సంబంధం శస్త్రచికిత్సలు చేసిన వారిలో ను పల్మనరీ ఎంబాలిజంఎక్కువగా గుర్తించటం జరుగుతుందన్నారు. ఇది చాలా ప్రమాదకర పరిస్థితి అని బాధితుల ప్రాణాలను కాపాడడం వైద్యులకు ఒక సవాలుగా పరిణమిస్తుంది అన్నారు. ఊపిరితిత్తులలో అడ్డుపడిన రక్త గడ్డ (బ్లడ్ క్లాట్స్)లను కరిగించడం ,శస్త్ర చికిత్స ద్వారా తొలగించడం ఎంతో కష్టతరమన్నారు. అంతేగాక నిర్ణీత సమయంలో చికిత్స చేయలేకపోతే మరణం తప్పదు అన్నారు. సమావేశంలో పాల్గొన్న హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ అంజత్ ఉప్పుటూరి మాట్లాడుతూ ఊపిరితిత్తులలోని రక్తపు గడ్డల విషయంలో అత్యవసర చికిత్సలవైద్య నిపుణులు ఎంతో నైపుణ్యంతో వ్యవహరించాలి అన్నారు. మందులతోనే చికిత్స చేయవచ్చునా.... శస్త్ర చికిత్స తప్పనిసరాఅన్నది వైద్యులు త్వరితగతిన నిర్ణయం తీసుకోగలగాలన్నారు. మెదడు, నరముల వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి మాట్లాడుతూ ప్రమాదాలలో మెదడు గాయాలైనప్పుడు వారి మానసిక ,శారీరక పరిస్థితులను బట్టి రేడియోలాజికల్ పరీక్షలు అవసరమవుతాయి అన్నారు. ఎప్పుడు ఏ పరీక్ష చేయాలనే అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అమృత హాస్పిటల్ ఎముకలు, కీళ్ల వైద్య, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మద్ది వినోద్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర ప్రమాదాలలోఎముకలు విరిగిన వారిలోనూ శస్త్ర చికిత్స చేసిన వారిలోనూ పల్మనరీ ఎంబాలిజంను గుర్తించడం జరుగుతోందన్నారు. శస్త్ర చికిత్స చేసిన వారి విషయంలో ను,ప్రమాదాల్లో ఎముకలు విరిగిన వారిలోనూ ఎంబాలిజం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మంగళగిరి ఎయిమ్స్ నుంచి వచ్చిన ఒక వ్యక్తులో అరుదైన వ్యాధిని గుర్తించి, చికిత్స చేయడం జరిగిందన్నారు .ఎన్నో యాంటీబయాటిక్స్ వాడిన ఎంతో కాలంగా తగ్గని జ్వరంతో ఆ వ్యక్తి తన దగ్గరకు రావడం జరిగిందన్నారు. అనేక పరీక్షలు అనంతరం ఆ వ్యక్తికి “మాక్రో ఫేస్ యాక్టివేషన్ సింగ్రోమ్ “గా వ్యాధిని నిర్ధారణ చేసి చికిత్స చేయడం ద్వారా వ్యక్తిని బతికించగలిగామన్నారు. అరుదైన వ్యాధులు సోకినవారు ఎంతో అరుదుగా వైద్యుల్ని ఆశ్రయించినప్పుడు లక్షణాలను ,రక్త పరీక్షలను బట్టి అనేక అరుదైన వ్యాధుల పట్ల వైద్యులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమానంతరం పలువురు వైద్యులు వ్యక్తపరచిన పలు సందేహాలనువక్తలు నివృత్తి చేశారు . వక్తలకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్, కార్యదర్శి డా. బి .సాయికృష్ణ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ గుంటూరు శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ శివప్రసాద్,సంయుక్త కార్యదర్శి డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి అధిక సంఖ్యలో నగర వైద్యులు పాల్గొన్నారు .

# కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి - మాజీ మంత్రి వెలంపల్లి

### పండగ పూట హోంగార్డు జానీ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే -- మాజీ మంత్రి వెలంపల్లి తీవ్ర ధ్వజం



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నిస్తేజ పరిపాలన, ఘోర నిర్లక్ష్యం కారణంగానే నగరంలో అమాయక హోంగార్డు జానీ (42)విద్యుత్ ఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ మంత్రి వర్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం కొత్తపేటలో కేవలం ఒక చిన్న అకాల వర్షానికే రోడ్లు జలమయమై, విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు జానీ మరణించడం కూటమి ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి సజీవ సాక్ష్యమన్నారు. మృతుడు జానీ భౌతికకాయాన్ని ఆయన సందర్శించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న జానీ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అన్ని విధాలా కొండంత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.?ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పండగ పూట ఒక నిరుపేద ప్రభుత్వ ఉద్యోగి, హోంగార్డు కుటుంబంలో ఈ కూటమి ప్రభుత్వం నింపిన విషాదం వర్ణనాతీతమైనదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నగర మౌలిక వసతులను పూర్తిగా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిసరాల్లో డ్రైనేజీల పూడికతీత పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే, స్వల్ప వర్షానికే పోలీస్ స్టేషన్ సైతం నీట మునిగిందన్నారు. రోడ్లపై నడుము లోతు నీరు చేరడం, ఆ నీటిలోనే విద్యుత్ వైర్లు తెగిపడటం పాలకుల, అధికారుల ఘోర తప్పిదమన్నారు. డ్రైనేజీల పూడికతీత పనులు గతంలోను సక్రమంగా చేయకపోవడం వల్ల ప్రజలు గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయారని, అయినా ఈ పాలకులకు బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. వరద వస్తే విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోవాల్సిందేనా? అని నిలదీసిన ఆయన, ఇది పాలకుల అసమర్థత వల్ల జరిగిన ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వెలంపల్లి శ్రీనివాసరావు ?బాధిత హోంగార్డు జానీ కుటుంబానికి కూటమి ప్రభుత్వం తక్షణమే ?50 లక్షల ఎక్స్‌గ్రేషియా (నష్టపరిహారం) ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ?సర్వీసులో ఉండగా చనిపోయినందున ఆయన కుటుంబంలో ఒకరికి తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు.?ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ తరఫున పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ ఏ. జె. సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం లూనా సెంటర్, సింగ్ నగర్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ ఏ. జె. సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవుకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు.ప్రతి శుక్రవారం తమ ఇంట్లో మరియు ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటుసుబ యూనిట్ ఆఫీసర్ రామచంద్రా రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ఎన్సిసి శిక్షణలో బెజవాడ రాజారావు స్కూల్ విద్యార్థులు....




**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల 17(ఏ)బి ఎన్ ఎన్ సి సి విజయవాడ జోన్ నిర్వహించిన ట్రైనింగ్ క్యాంపు లో బెజవాడ రాజారావు హై స్కూల్ విద్యార్థులు ఎన్ సి సి శిక్షణా కాలంలో చక్కని ప్రతిభ కనబర్చారు.స్థానిక ఆంధ్ర లయోలా కాలేజీ ఆవరణలో 17(ఏ)బి ఎన్ ఎన్ సిసి విజయవాడ జోన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 29 వరకు జరిగిన వార్షిక శిక్షణ శిబిరం జరిగింది. ఈ శిక్షణ శిబిరంలో బెజవాడ రాజారావు హై స్కూల్ నుంచి జెడి -11 (బాలురు), జె డబ్ల్యూ-13 (బాలికలు) మొత్తం 24 క్యాడేట్స్ పాల్గొన్నట్లు బెజవాడ రాజారావు హై స్కూల్ ప్రకటించింది. ఈ శిక్షణ శిబిరంలో గన్ ఫైరింగ్, మ్యాప్ రీడింగ్,ఎన్ డి ఆర్ ఎఫ్ ట్రైనింగ్, ఫైర్ సేఫ్టీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి తదితర అంశాలలో ఎన్సిసి విద్యార్థులు శిక్షణ పొందినట్లు వెల్లడించింది . ఇక క్రీడా విభాగంలో ఆల్ఫా కంపెనీ తరఫున అల్లం వేదశ్రీ , చీమకుర్తి పుష్పజలక్ష్మి త్రోబాల్ లో పాల్గొని తమ సత్తా చాటి రన్నర్స్ గా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సెక్రటరీ శ్యాంప్రకాష్, ప్రిన్సిపల్ కె ఎల్ ప్రసన్న, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బెజవాడ రాజారావు ఎన్సిసి సర్టిఫికెట్స్ అందజేశారు.




# శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో రాష్ట్ర మంత్రి శ్రీమతి ఎస్ సవిత



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీమతి ఎస్. సవిత, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానాన్ని (కనకదుర్గ గుడి) శుక్రవారం దర్శించుకున్నారు. తన కుమారుడితో కలిసి వచ్చిన ఆమె, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి తన కుమారుడితో కలిసి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ మండపంలో వేద పండితులు మంత్రి కుటుంబ సభ్యులకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా డెప్యూటీ ఈఓ కిశోర్ కుమార్ మంత్రికి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు.

# బక్రీద్ పండుగ రోజు విషాద ఘటన.. కరెంట్ షాక్‌తో హోంగార్డు జానీ మృతి



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ లో బక్రీద్ పండుగ రోజు విషాద ఘటన చోటుచేసుకుంది. పశ్చిమ నియోజకవర్గంలోని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న జానీ(45) కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు .బక్రీద్ పండుగ సందర్భంగా సెలవు తీసుకున్న జానీ తన సొంత ఆటోలో భార్యతో కలిసి బిర్యానీ తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ సమీపానికి చేరుకోగానే ఈదురు గాలులు, అకాల వర్షం కారణంగా రోడ్డుపై భారీగా నీరు నిలిచింది. నీటిలో ఆటో నిలిచిపోవడంతో జానీ తన భార్యను ఆటోలోనే ఉంచి, వాహనాన్ని నెట్టుకుంటూ సమీపంలోని టీ స్టాల్ వద్దకు తీసుకెళ్లాడు .అయితే అదే సమయంలో బలమైన గాలుల కారణంగా విద్యుత్ తీగ తెగి ఆటో సమీపంలో పడింది. ఈ విషయాన్ని గమనించని జానీ, వెనక్కి కదులుతున్న ఆటోను ముందుకు నెట్టేందుకు ప్రయత్నిస్తూ కిందకు దిగాడు . ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కి గురై తీవ్రంగా గాయపడ్డాడు . స్థానికులు వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే జానీ మృతి చెందారు. ఆటోలో ఉన్న ఆయన భార్య మాత్రం సురక్షితంగా బయటపడింది. పండగ రోజునే కుటుంబ పెద్దను కోల్పోవడంతో జానీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.జానీ కి నలుగురు సంతానం. అందులో ముగ్గురు మగ పిల్లలు కాగా ఐదేళ్ల పాప కలదు.సహోద్యోగులు, స్థానికులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

# ఎస్ ఎన్ జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ. మరియు మొక్కలు నాటే కార్యక్రమం..






**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వేసవిని దృష్టిలో ఉంచుకొని, సామాజిక బాధ్యతగా ఎస్ ఎన్ జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 65 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు..విఎంసి కార్పొరేషన్ వద్దనున్న ప్రకృతి వనంలో శుక్రవారం 66 వ రోజు నిర్వహించిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు..అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం ఎస్ ఎన్ జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు..పర్యావరణానికి మేలు చేకూర్చేలా పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు పక్కన, మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటుతూ ప్రత్యేక దృష్టి సారించిన ఎస్ ఎన్ జి ఫౌండేషన్ సభ్యులను ప్రత్తిపాటి శ్రీధర్ అభినందించారు.. ఈ కార్యక్రమంలో ఎస్ ఎన్ జి ఫౌండేషన్ చైర్మన్ లయన్ కె శారదవాణి,లయన్ కే వి డి ప్రసాద్, సభ్యులు ఎర్నిని పద్మజ, మల్లికార్జునరావు, కుమారి , విజయలక్ష్మి, షా న్యూస్ ఎడిటర్ హుమాయున్, మల్లికార్జున, వాణి, సంసుద్దిన్, వంశీ, విజయ్, ఆదిత్య, జనసేన నేతలు బొల్లేపల్లి కోటేశ్వరరావు, ఏలూరు సాయి శరత్, సుజనామిత్ర కోఆర్డినేటర్ దొడ్ల రాజా పాల్గొన్నారు..

# జూన్ 1 నుండి ఇగ్నో పరీక్షలు ప్రారంభం

**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే జూన్ 2026 టర్మ్ ఎండ్ పరీక్షలు జూన్ 1, 2026 నుండి జులై 21, 2026 వరకు జరుగుతాయని ఇగ్నో ప్రాంతీయకేంద్రం రీజినల్ డైరెక్టర్ డా. కె. సుమలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయకేంద్రం పరిధిలో 6 పరీక్షా కేంద్రాలను విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్ మరియు అనంతపురం లలో ఏర్పాటు చేసామన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ హాల్ టికెట్స్ ను ఇగ్నో వెబ్ సైట్ నందు అందుబాటులో ఉంచబడ్డాయని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్స్ ని ఇగ్నో విశ్వవిద్యాలయపు సమర్థ్ స్టూడెంట్ పోర్టల్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబందించి అభ్యర్థులు తమతమ అధ్యయన కేంద్రాలను థియరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని డా. కె. సుమలత పేర్కొన్నారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు అని తెలియచేసారు.

# నవాబుపేటలో ఘనంగా మహానాడు వేడుకలు

**పెనుగంచిప్రోలు, మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి):** మండలంలోని నవాబుపేట గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో వాసవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్త్రీ శక్తి పర్చువల్ మహానాడు వేడుకలు గురువారంతో ఘనంగా ముగిశాయి.మొదటి రోజు కార్యక్రమంలో ఉండవల్లి శ్రీదేవి , గద్దె అనురాధ పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.
స్త్రీ శక్తి మహానాడులో రెండవ రోజు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కుమారుడు శ్రీరామ్ కిట్టు , మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య పాల్గొని పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న సీనియర్ కార్యకర్తలను సన్మానించడం జరిగింది.మొత్తంగా పెనుగంచిప్రోలు మండలంలోని రెండు గ్రామాల్లో జరిగిన మహానాడు వేడుకలను బూతే నా భవిష్యత్" అన్న చందంగా నిర్వహించిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య ను పార్టీ పెద్దలు, కార్యకర్తలు అభినందించారు.మన జగ్గయ్యపేట నియోజకవర్గం క్లస్టర్–



7లో భాగంగా తోటచెర్ల, వెంకటాపురం, ముండ్లపాడు, సుబ్బాయిగూడెం, శనగపాడు, కొనకంచి, కొళ్ళికూళ్ళ గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సహకరించిన పార్టీ



నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా శక్తి సభ్యులు మరియు ప్రతి గ్రామ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఇద్దరు యువకుల ఆకస్మిక మృతి దురదృష్టకరం

### ఎమ్మెల్యే ఆదేశాలతో కుమ్మరిపాలెం మృతుల కుటుంబాలకు ఏఎంసీ చైర్మన్ పరామర్శ



**కోదూరు, మే 29 (వార్తా ప్రభ) :**తాటిచెట్టు పడి ఇద్దరు యువకులు ఆకస్మిక మృతి చెందిన ఘటన దురదృష్టకరమని ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు కోదూరు మండల పరిధిలోని విశ్వనాధపల్లి పంచాయతీ కుమ్మరిపాలెంలో గరికిపాటి మనోహర్ బాబు, చిట్టూరి శివరామకృష్ణ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. శోకసంద్రంలో మునిగిన కుటుంబ సభ్యులను ఓదార్చడంతో పాటు వారిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఘటన స్థలాన్ని స్థానిక జనసైనికులతో కలిసి తోట కనకదుర్గ పరిశీలించారు.

## బక్రీద్ సందర్భంగా జర్నలిస్టులకు అల్తాఫ్ బాబా ఆత్మీయ విందు

### జర్నలిస్టులకు సత్కారం



**ఇబ్రహీంపట్నం, మే 29(వార్తా ప్రభ ప్రతినిధి):**బక్రీద్ పండుగ సందర్భంగా జర్నలిస్టు సోదరులకు హజరత్ సయ్యద్ షాబుఖారి ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఇటీవల ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్, ఏపీఎంపీఏ రాష్ట్ర కార్యదర్శి చైతన్య లతో పాటు సీనియర్ జర్నలిస్టులు మరియు యువ జర్నలిస్టులను ఆత్మీయంగా సత్కరించారు. వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టు సోదరులు పాల్గొన్నారు.

## యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము నందు సుదర్శన హోమం



**జగ్గయ్యపేట మే 29 (వార్తప్రభ)** పావన కృష్ణానది తీరమున ప్రసిద్ధ పుణ్య క్షేత్రము స్వయంభూ శ్రీ పంచనారసింహ క్షేత్రమై నెలకొనియున్న వేదాద్రి గ్రామం, శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము నందు శ్రీ స్వామి వారి జన్మనక్షత్రం అయిన స్వాతి నక్షత్రం రోజు ప్రతి నెల దేవదాయ ధర్మదాయ శాఖ శాస్త్రోక్తముగా నిర్వహించబడు సుదర్శన హోమం శుక్రవారం ఉదయం స్వాతి నక్షత్రం సందర్భంగా యాగ పండితులతో శ్రీ లక్ష్మీ నరసింహ సుదర్శన హోమం జరుపబడినది. మరియు దేవస్థానము నందు ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజు శ్రీ లక్ష్మీ నరసింహ సుదర్శన హోమం జరిపించుకొదలచిన భక్తులు వారం రోజులు ముందుగా దేవాలయ కార్యాలయం నందు సంప్రదించగలరని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరాదత్తు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ కానూరి సురేష్ బాబు తెలియజేసినారు.

## జనతా వారధి కార్యక్రమంలో ప్రజా సమస్యల స్వీకరణ



**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ప్రజల సమస్యలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు శ్రీ అడ్డూర్ శ్రీరామ్ , స్టేట్ హెడ్ క్వార్టర్స్ ఇంచార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు , రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ షేక్ బాజీ , పిట్టల గోవిందు పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ దృష్టికి ప్రజల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తూములూరికృష్ణ చైతన్య,ప్రవీన్ రాంకా మరియు బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణ సమస్యలపై కౌన్సిల్ గరం గరం

● సమస్యలపై గళమెత్తిన అధికార పార్టీ కౌన్సిలర్ ● ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపణ



**ఇబ్రహీంపట్నం, మే 29 (వార్తా ప్రభ ప్రతినిధి):** పట్టణంలో సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. కొండపల్లి పురపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో ఎజెండాలోని పొందుపర్చిన 22 అంశాలను చదివి వినిపించగా, సభ్యులు చర్చించి 21 అంశాలపై తీర్మానాన్ని ఆమోదించారు. ఒక అంశాన్ని మరో సమావేశానికి వాయిదా వేశారు. జీరో అవర్ లో అధికార పార్టీ కౌన్సిలర్ చుట్టుకుదురు వాసు ప్రతిపక్ష పాత్ర పోషించారు. తన వార్డులో సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కావడం లేదన్నారు. మొదటి కౌన్సిల్ సమావేశంలో విద్యుత్ స్తంభాల సమస్యను సమావేశం దృష్టికి తీసుకొస్తే ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని, ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తన వార్డు పరిధిలోని మార్కెట్ సెంటర్ లో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ స్థలం లేకపోతే ప్రైవేట్ స్థలమైనా కొనుగోలు చేసి నిర్మించాలని కోరారు. వర్షం వస్తే



ముంపునకు గురవుతున్న ప్రాంతంలో కల్వర్టు నిర్మించలేక పోతున్నట్లు చెప్పారు. తన వార్డులో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందన్నారు. కౌన్సిల్ ఏర్పడి ఏడాదవుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. కనీసం లైట్లు లేవు.. వెల్డింగ్ రాడ్ లు లేవంటున్నారని చెప్పారు. అలాగే మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు కౌన్సిలర్ లు ఎవరో కూడా తెలియకుండా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ కౌన్సిలర్లు అవగాహన కలిగి మాట్లాడాలన్నారు. దీంతో వాసు కలుగజేసుకుని తమకు అహగాహన లేకుండానే మాట్లాడుతున్నామని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. వైసీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు మాట్లాడుతూ శ్రామిక నగర్ లో బీసీ సామాజిక భవనం నిర్మాణం ప్రారంభించేందుకు చైర్మన్ చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయాల్లో దాహం కేకలు శీర్షికన ఆంధ్రప్రభలో వచ్చిన కథనం మేరకు మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ల పట్ల కమిషనర్ అమర్యాదగా మాట్లాడటం సరికాదన్నారు. ఆయన తీరు మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు అమ్మాజీ, గోపాలరావు సమస్యలను ప్రస్తావించారు. చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కమిషనర్ తో కలిసి వార్డుల్లో పర్యటిస్తున్నామని, సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. సమావేశానికి టీపీఎస్ ప్రసాద్ గైర్హాజరు కావడంతో నోటీసు ఇవ్వాల్సిందిగా చైర్మన్ చిట్టిబాబు ఆదేశించారు.

# విద్యుత్ శాఖ సిబ్బంది అంకితభావ సేవలకు ప్రజల అభినందనలు

**జగ్గయ్యపేట, మే 29(వార్తప్రభ)**ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యం కారణంగా విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. బలమైన గాలులు, భారీ వర్షాలు మరియు విపత్తు ప్రభావంతో అనేక విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, విద్యుత్ తీగలు తెగిపోవడం వల్ల అనేక గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గత నాలుగు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ లేకపోవడం వల్ల ముఖ్యంగా శిశువులు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు మరియు సాధారణ ప్రజలు తమ నిత్యజీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. తాగునీటి సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, విద్యార్థుల చదువులు, చిన్న వ్యాపారాలు మరియు ఇతర దైనందిన కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, విద్యుత్ శాఖకు చెందిన ఎఇలు, ఎడిఇలు, లైన్‌మెన్లు మరియు ఇతర సిబ్బంది తమ కుటుంబాలను సైతం పక్కనబెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. రాత్రింబవళ్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, తెగిపోయిన తీగల మరమ్మత్తు, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ప్రజలకు విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలనే లక్ష్యంతో విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బంది చూపుతున్న అంకితభావం, కర్తవ్యనిబద్ధత మరియు సేవా దృక్పథం నిజంగా అభినందనీయమైనది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడగా, మిగిలిన ప్రాంతాల్లో కూడా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎఇలు, ఎడిఇలు మరియు మొత్తం సిబ్బందికి ప్రజల తరఫున సామాజికవేత్త శ్రీరామ్ సింగ్ హృదయపూర్వక ధన్యవాదాలు మరియు ప్రత్యేక అభినందనలు







తెలియజేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారు చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో విలువైనవి. అలాగే, ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరించని ప్రాంతాల్లో పనులను మరింత వేగవంతం చేసి, వీలైనంత త్వరగా విద్యుత్ అందించేందుకు చర్యలు కొనసాగించాలని కోరారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి సేవలందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కి విద్యుత్ శాఖ సిబ్బందికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# క్రిమినల్ లాయర్...

### సముద్ర తీర కబ్జాపై సంచలన ఆరోపణలు.. విచారణకు డిమాండ్...



**మచిలీపట్నం మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నార్త్ మండలం పెదపట్నం గ్రామ పరిసరాల్లో లాయర్ ముసుగులో మడ అడవులను ఆక్రమించి అక్రమాలకు పాల్పడుతున్నారని సహా న్యాయవాది జీవీ రమణ తీవ్ర ఆరోపణలు చేశారు. సుమారు 450 ఎకరాల ప్రభుత్వ భూమిని అనధికారికంగా ఆక్రమించారని, దీనికి కొందరు జిల్లా అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. అనుమతి పత్రాలు లేకుండానే ప్రభుత్వ సర్వే నెంబర్లలోని భూములను చెరువులుగా మార్చారని రమణ మండిపడ్డారు. ఈ అక్రమాలపై ప్రశ్నించే వారిపై ప్రైవేట్ సైన్యంతో పాటు పెంపుడు కుక్కలతో దాడులు చేయిస్తూ, అక్రమ కేసులు నమోదు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై నాలుగు నెలల పాటు గ్రౌండ్ లెవెల్‌లో విచారణ నిర్వహించి, పూర్తి ఆధారాలను సేకరించిన అనంతరం మీడియా ముందుకు వచ్చానని జీవీ రమణ తెలిపారు. లాయర్ ముసుగులో నేరాలకు పాల్పడుతున్న అంగర రంగనాథ్‌పై న్యాయశాఖ పూర్తిస్థాయిలో విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని, మడ అడవులను పరిరక్షించి వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిజానిజాలు వెలికి తీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మద్యం సేవించి వాహనం నడిస్తే కఠిన చర్యలు.- ఎస్ఐ పైడి బాబు



**కృత్తివెన్ను మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణ జిల్లా ఎస్పీ వి.విద్యసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మచిలీపట్నం డీస్పీ జి .శ్రీనివాసరావు పర్యవేక్షణలో పెడన సీ.ఐ ఆధ్వర్యంలో కృతివెన్ను ఎస్సై పైడి బాబు శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భాగంగా కృతివెన్ను పోలీస్ స్టేషన్ పరిధిలో నేషనల్ హైవే 216 పై ప్రతిరోజు తనిఖీలునిర్వహిస్తున్నాట్లు తెలిపినారు. కృత్తివెన్ను మండలం లో ప్రతి గ్రామానికి జాతీయ రహదారి 216 అనుసంధానం ఉండటంతో హైవేపై ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపినారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరు పరుస్తామని వారు పదివేల రూపాయలు వరకు జరిమానా విధించవచ్చు అని తెలియ పరిచారు

## చిత్తలూరు ఎస్సీ కాలనీలో కిశోరి వికాసం



**చేజర్ల మే 29 (వార్తాప్రభ)** మండలంలోని చిత్తలూరు ఎస్సీ కాలనీ నందు వేసవి సెలవుల కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా విద్య మరియు వారి యొక్క భవిష్యత్తుకు సూచించే నైపుణ్యాల అభివృద్ధి గురించి కిశోరి బాలికలకు బాలురకు ప్రతి ఒక్కరు కూడా స్కూలు కాలేజీ మానివేయకుండా చదువు పూర్తిస్థాయిలో కొనసాగించాలని ఐసిడిఎస్ చేజర్ల సెట్ ఆఫ్ సూపర్వైజర్ ఎం.పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగాలు వచ్చే విధంగా కష్టపడి చదువు కొనసాగించాలన్నారు. భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అలాగే సెల్ ఫోన్లు వాడకంలో మంచి చెడు రెండు ఉంటాయని అందులో మంచిని మాత్రమే విద్యార్థులు తీసుకోవాలని తెలిపారు.అవసరం మేరకు సెల్ ఫోన్లు వాడాలన్నారు.మన అవసరం కొరకు మాత్రమే ఫోన్ ఉపయోగించాలన్నారు.బాల్య వివాహాల చట్టాల గురించి హెల్ప్ లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు కిశోరీ బాలికలు పాల్గొన్నారు.

## ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని కలిసిన తొండపు దశరథ జనార్ధన్



**జగ్గయ్యపేట మే 29 (వార్తప్రభ)** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి, యువనాయకుడు నారా లోకేష్ ని జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన తొండపు దశరథ జనార్ధన్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్య మరియు ఐటీ రంగాలను మరింత అభివృద్ధి చేసి యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నారా లోకేష్ పేర్కొన్నారు.అలాగే, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. తొండపు దశరథ జనార్ధన్ పార్టీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

### సంగమేశ్వర జట్టుకు బహుమతులు అందజేత



**సంగం మే 29(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం కొరిమెర్ల హైస్కూల్ ప్రాంగణంలో ఇటీవల దివంగత వంగల్లు రాజా జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసాయి. వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్న జట్లు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లతో ప్రేక్షకులను అలరించాయి.ఈ టోర్నమెంట్‌లో సంగం సంగమేశ్వర టీమ్ అద్భుత ప్రదర్శన కనబరిచి మొదటి బహుమతిని కైవసం చేసుకోగా మరో సంగం టీమ్ రెండో బహుమతిని సాధించింది. ఏఎస్‌పేట టీమ్ మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు అతిథులు నగదు బహుమతులను అందజేశారు.మొదటి బహుమతి గెలుచుకున్న సంగమేశ్వర టీమ్‌కు రూ.25 వేల నగదు బహుమతిని భువనేశ్ లైఫ్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ టీమ్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ రాజశేఖర్ అందజేశారు.రెండో బహుమతి సాధించిన జట్టుకు రూ.15 వేల నగదు బహుమతిని కేవీకే ఫౌండేషన్ అధినేత కాకు మధుసూదన్ యాదవ్ అందించారు.మూడో బహుమతి గెలుచుకున్న ఏఎస్‌పేట జట్టుకు రూ.10 వేల నగదు బహుమతిని కాకు మదన్ కుమార్ యాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దివంగత వంగల్లు రాజా జ్ఞాపకార్థం యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి మృతిపై ఎమ్మెల్యే సుజనా చౌదరి దిగ్భ్రాంతి

**విజయవాడ పశ్చిమ మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు క్రియాశీల పాత్ర పోషించిన సీనియర్ నాయకుడు , ఉమ్మడి రాష్ట్ర మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి (85) మృతి పట్ల మాజీ కేంద్ర మంత్రి వర్యులు విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి ) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రిగా, 5 సార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని కొనియాడారు.. ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటుగా ఎమ్మెల్యే సుజనా చౌదరి పరిగణించారు.. గాదె వెంకటరెడ్డి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పందించారు....



## జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణదాతగా మారిన టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్

**గుండెపోటు బాధితుడికి పునర్జన్మ**



**జగ్గయ్యపేట మే 29 (వార్తప్రభ)**ప్రభుత్వ వైద్యం పేద ప్రజలకు వరంగా మారుతోంది అనడానికి జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రం లో ఇటీవల జరిగిన ఒక సంఘటనే నిదర్శనం. సకాలంలో స్పందించిన వైద్య బృందం, అత్యాధునిక అత్యవసర చికిత్సతో ఒక ప్రాణాన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు.

**అసలేం జరిగిందంటే..?** ఇటీవల ఒక రోగి తీవ్రమైన ఛాతీ నొప్పితో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. బాధితుడి పరిస్థితిని గమనించిన స్థానిక డ్యూటీ వైద్యులు తక్షణమే ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఈ లోపు కార్డియాలజిస్ట్ (గుండె జబ్బుల నిపుణులు)ఫోన్ లో అందుబాటులోకి రాగా, వారి సలహా మేరకు రోగికి మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (తీవ్రమైన గుండెపోటు) వచ్చినట్లు నిర్ధారించారు.నగుండెపోటు వచ్చిన మొదటి గంట (గోల్డెన్ అవర్) ఎంతో కీలకమైనది. కార్డియాలజిస్ట్ సూచనల మేరకు, రోగి ప్రాణాలను కాపాడటానికి గుండె రక్తనాళాల్లోని గడ్డలను కరిగించే అత్యంత ఖరీదైన టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ను వైద్యులు సకాలంలో బాధితుడికి అందించారు. ఈ ఇంజెక్షన్ వల్ల రోగి ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడమే కాకుండా, అతని గుండె పనితీరు దెబ్బతినకుండా బ్రతికే అవకాశాలు మెరుగయ్యాయి. అనంతరం రోగిని తదుపరి పర్యవేక్షణ కోసం ఉన్నత చికిత్సకు తరలించారు.

**ప్రభుత్వ సేవలను వినియోగించుకోండి** కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ఇలాంటి అత్యవసర గుండెపోటు చికిత్సలు మరియు ఇంజెక్షన్లు ఇప్పుడు మన జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా లభిస్తున్నాయి. ఛాతీ నొప్పి, శ్వాస ఆడకపోవడం వంటి గుండెపోటు లక్షణాలు కనిపించినప్పుడు సమయాన్ని వృథా చేయకుండా వెంటనే జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించండి. ప్రభుత్వ ఆసుపత్రిలో లభించే ఉచిత, నాణ్యమైన వైద్య సేవలను మరియు అనుభవజ్ఞులైన వైద్యుల నైపుణ్యాన్ని ఉపయోగించుకుని ప్రాణాలను కాపాడుకోండి.వైద్యో నారాయణో హరి సకాలంలో స్పందించి రోగి ప్రాణాలు కాపాడిన జగ్గయ్యపేట వైద్యులకు, సిబ్బందికి స్థానిక ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

## పేరూరులో మే 31న ఉచిత మెగా వైద్య శిబిరం

**-ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ ఎస్. ప్రవీణ్ రావు**

**అమలాపురం మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పేరూరు, పరిసర ప్రాంత ప్రజలకు ఒక సువర్ణావకాశం లభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య సంస్థ శంభుకారి ఎండోక్రైన్ హాస్పిటల్స్ సహకారంతో మే 31వ తేదీ ఆదివారం పేరూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరం తాడిగుంట మరకలోని శ్రీ విజయ భేతాళస్వామి గుడి వద్ద ఉన్న మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగనుంది. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగ పడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో థైరాయిడ్ పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహించ బడతాయి. అదేవిధంగా రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) పరీక్షలు కూడా ఉచితంగా చేయనున్నారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మెగా వైద్య శిబిరంలో వివిధ వైద్య రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు పాల్గొని రోగులకు సేవలందించనున్నారు. శంభుకారి ఎండోక్రైన్ హాస్పిటల్స్, అమలాపురంకు చెందిన ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఎస్. ప్రవీణ్ రావు రోగులను పరీక్షించి షుగర్, థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యత, అధిక బరువు, ఎండోక్రైన్ సంబంధిత, ఇతర అనుబంధ వ్యాధులపై వైద్య సలహాలు అందించనున్నారు. అలాగే ముమ్మిడివరంలోని విజయ్ చెస్ట్ హాస్పిటల్కు చెందిన ఛాతీ, శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ గంధం విజయ్ కిరణ్ శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించనున్నారు. దగ్గు, కఫం, ఆస్తమా, టీబీ, సీఓపీడీ, ఊపిరితిత్తుల్లో నీరు లేదా చీము చేరడం, నిద్రలో గురక వంటి సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందించనున్నారు. రాజమహేంద్రవరంలోని వేద హాస్పిటల్ స్పైన్ విభాగానికి చెందిన ఆర్థోపెడిక్ స్పైన్ సర్జన్ డాక్టర్ పి. తేజో ఫణీంద్ర వెన్నుముక, మెడ, నడుము, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి చికిత్సా సూచనలు అందించనున్నారు. మెడ నొప్పి, నడుం నొప్పి, కాళ్లు మరియు చేతుల్లో తిమ్మిర్లు, డిస్కు సమస్యలు, వెన్నుముక ఫ్రాక్చర్లు, ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలకు నిపుణుల సలహాలు అందుబాటులో ఉంటాయి. శిబిరానికి హాజరయ్యే రోగులు తమ వద్ద ఉన్న పాత వైద్య రిపోర్టులు, పరీక్షల వివరాలు, వాడుతున్న మందుల వివరాలు వెంట తీసుకురావాలని నిర్వాహకులు కోరారు. దీని ద్వారా వైద్యులు రోగుల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి సరైన సూచనలు ఇవ్వగలరని తెలిపారు. ఈ కార్యక్రమం పేరూరు జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు మొయిల శివ, తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెచ్చెట్టి రమణారావు (కన్న) పర్యవేక్షణలో నిర్వహించబడుతోంది. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇంటి వద్దకే రక్త పరీక్షల సేకరణకు ప్రమోద్ డయాగ్నోస్టిక్ సేవల కోసం 9908300531 నంబర్ను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే మందుల డోర్ డెలివరీ కోసం విజయదుర్గా మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ను 8309545269, 7288831834 నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యులను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువస్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు...



పెనుగంచిప్రోలు, మే 29( వార్త ప్రభ ) పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు,మిరియాల శేషగిరిరావు స్వామి జీ ధర్మపత్ని శ్రీలక్ష్మిదంపతులు,విసుగు మహల్ గ్రామం,కొత్తపేట మండలం,కోనసీమ జిల్లా వారు ఈరోజు భక్తులకు మజ్జిగ పంపిణీ నిర్వహించారు...

# స్వచ్ఛతపై జిఈఎమ్ బాలికల నాటిక!!

● రైల్వే స్టేషన్లో స్వచ్ఛత చైతన్యం ● ఎన్టీపీసీ స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం ● ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం ● స్వచ్ఛతే సామాజిక బాధ్యత ● ఈడీ చందన్ కుమార్ సమంత







**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 29 ( వార్తాప్రభ ప్రతినిధి)** స్వచ్ఛ భారత్ సంకల్పాన్ని ప్రజల్లో మరింత బలోపేతం చేసే దిశగా ఎన్టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే సహకారంతో రామగుండం రైల్వే స్టేషన్లో గురువారం నుక్కడ్ నాటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ బాలికలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. నుక్కడ్ నాటక్ ద్వారా జెమ్ బాలికలు ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రత పాటించాల్సిన అవసరం, ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి అంశాలపై హృద్యంగా సందేశాలు అందించారు. వారి ప్రదర్శనలు ప్రయాణికులను ఆలోచింపజేసి స్వచ్ఛత పట్ల చైతన్యం కలిగించాయి. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు. సామాజిక బాధ్యతను చాటుతూ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్టీపీసీ చేపడుతున్న గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ కార్యక్రమం ప్రశంసనీయమని పలువురు అభినందించారు. హ్యూమన్ రిసోర్సెస్ విభాగాధిపతి సాగర్ రంజన్ సాహూతో పాటు హెచ్ఆర్ బృందం, ఎంసీఆర్, ఎఫ్ఎం విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పలుగు పారపట్టి.. కూలి నెంబర్ వన్ గా కలెక్టర్

- ఉపాధి హామీ శ్రామికులతో చేయి కలిపిన కలెక్టర్ - జిల్లాలో విజయవంతంగా జలధార కార్యక్రమం
- రూ. 87 కోట్ల ఉపాధి నిధుల అనుసంధానంతో 1,300 పనులు - భూగర్భ జలాల వృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి శ్రామికులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**ఇబ్రహీంపట్నం, మే 29(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో నీటి వనరుల సంరక్షణ, సుస్థిర జలవ్యవస్థ నిర్మాణం, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ సమతౌల్యం కోసం చేపడుతున్న జలధార–జలహారతి కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందని.. జలవనరుల సంరక్షణను కేవలం అభివృద్ధి కార్యక్రమంగా కాకుండా భవిష్యత్ తరాలకు భద్రమైన పర్యావరణాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందించి అమలుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడు జోడిచింతల చెరువులో శుక్రవారం జరుగుతున్న జలధార–జలహారతి పనులను కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తానుకూడా పలుగు పారపట్టి చెరువు పనిలో భాగస్వామిగామారి ఉపాధి శ్రామికులను ప్రోత్సహించారు. శ్రామికులతో కలిసి భోజనం చేస్తూ క్షేమసమాచారాన్ని తెలుసుకున్నారు. పనుల పురోగతి, నాణ్యత, శ్రామికులకు అందుతున్న వేతనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎం దార్శనికత, దిశానిర్దేశానికి అనుగుణంగా జిల్లాలో జలధార కార్యక్రమాలను చేపట్టామని... జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 445 చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి, దశల వారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. వీటి పూర్తిస్థాయి సామర్థ్యం 10.4 టీఎంసీలు కాగా ప్రస్తుతం వీటి సామర్థ్యం 5.5 టీఎంసీలు మాత్రమేనని.. వచ్చే వర్షాకాలం నాటికి అన్ని చెరువులను పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న చెరువులుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. చెరువుల పూడిక తొలగింపు, నీటి నిల్వ సామర్థ్య పెంపు, ఫీడర్ ఛానళ్ల పునరుద్ధరణ, గట్ల నిర్మాణం, చెరువు కట్టల బలోపేతం వంటి పనులను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. జిల్లాలో జలధార కింద ఉపాధి హామీ పథకం అనుసంధానంతో రూ. 87 కోట్లతో చేపట్టేందుకు 1,300 పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఆర్థిక వృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు: చెరువుల పునరుద్ధరణ ద్వారా వర్ష జలాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల మట్టం పెరగడంలో గణనీయ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. దీని వల్ల వ్యవసాయానికి నీటి అందుబాటు మెరుగుపడటంతో పాటు తాగునీటి సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని చెప్పారు. జలధార కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, మండల, గ్రామ స్థాయిలో ఏర్పాటైన కమిటీలు చెరువుల పరిరక్షణ, పనుల పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాయని తెలిపారు. అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపల పెంపకం, పశుసంవర్ధక రంగం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు కూడా ఈ కార్యక్రమం మేలు చేస్తోందని తెలిపారు.అధికారుల సమన్వయంతో టీమ్ ఎన్టీఆర్ కృషిచేస్తోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, డీఎఫ్వో జి.సతీష్, ఎంపీడీవో డి.శకుంతల, ఏపీవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# అవసరానికి నీరు అందించలేరు..

## ఉన్న వనరులను కాపాడలేరు..

**చల్లపల్లి:అవనిగడ్డ:మే29(వార్తాప్రభ ప్రతినిధి)**అవసరానికి నీరు అందించలేరు.... ఉన్న వనరులను కాపాడలేరు....అనే చందంగా తయారైంది చల్లపల్లిలో పరిస్థితి ! గురువారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి పునరుద్దరణకు దాదాపు పద్దెనిమిది గంటల సమయం పట్టింది..దీంతో గ్రామ పంచాయతీ నిర్వహణలోని రక్షిత నీటి పథకం మొరాయించి గ్రామంలో నీటి కొరత ఏర్పడింది.చుక్కనీరు లేక జనం విలవిల్లాడారు.డబ్బులు వెచ్చించి కనీసం త్రాగునీటి అవసరాల కోసం ఒక క్యాన్ ఆయినా కొనుగోలు చేద్దామని ఆర్వో ప్లాంట్ లకు క్యూ కట్టినా విద్యుత్ సరఫరా లేక పోవడంతో అక్కడా చుక్క నీరు దొరకలేదు.దివిసీమకు ముఖ్య వాణిజ్య కూడలిగా ఉన్న చల్లపల్లి తీర ప్రాంతానికి సమీపంలో ఉండటంతో తరచుగా పకృతి విపత్తులకు గురవుతూనే ఉంటుంది.పకృతి ప్రకోపించిన ప్రతిసారీ ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేయడం, పరిస్థితి చక్కబడిన తర్వాత సరఫరా పునరుద్ధరించడం ఈ ప్రాంత వాసులకు అనుభవమే.నీటి అవసరాల కోసం గ్రామంలో ఎక్కడికక్కడ చేతి పంపులు,చేద బావులు ప్రజలకు అందుబాటులో ఉండి ఆపత్కాలంలో సైతం త్రాగు,వాడునీటికి ఇబ్బంది లేకుండా ఆదుకునేవి. కాలక్రమంలో కొందరు స్వార్థంతో సదరు నీటి వనరులున్న విలువైన ప్రభుత్వ స్థలాలపై కన్నేసిన ప్రబుద్ధులు




క్రమక్రమంగా నీటి వనరులను మాయం చేసేస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేసేస్తున్నారు. పంచాయతీకి చెందిన అన్యాక్రాంతం అయిన బావులు వంటి నీటి వనరులను అధికార యంత్రాంగం పునరుద్దరిస్తే ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కొంతమేర వెసులుబాటుగా ఉండేది.ఎల్ నినో హెచ్చరికల నేపథ్యంలో నీటి సంక్షోభం చుట్టుముట్టక ముందే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార – జలహారతి కార్యక్రమంలో భాగంగా ఆక్రమణలకు గురైన బావులు వంటి నీటి వనరులను అధికార యంత్రాంగం వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన పునరుద్దరించాలని పలువురు కోరుతున్నారు.

## మచిలీపట్నంలో నేడు దోకిపర్రు శ్రీ వేంకటేశ్వరుని కల్యాణోత్సవం...



**గుడ్లవల్లేరు :మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని దోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి శనివారం మచిలీపట్నంలో కల్యాణోత్సవాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు శుక్రవారం తెలిపారు. మచిలీపట్నంలోని రామానాయుడు పేటలోని ఎల్.వి.పి. డివిజినల్ ఆఫీస్ ఎదురుగా కెనెడి రోడ్డులోని హిందూ కళాశాలలో శనివారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8.30గంటల వరకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులెల్లరూ విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్ధ ప్రసాదాలను స్వీకరించవలసిందిగా కోరారు.

## విద్యుత్ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిన ఈదురుగాలులు.

**నియోజకవర్గంలో విరిగిన, ఒరిగిన 120 విద్యుత్ స్థంభాలు, పది ట్రాన్స్ ఫార్మర్లు పునరుద్ధరణ.**



**అవనిగడ్డ: మే29 (వార్తాప్రభ ప్రతినిధి)**ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా వ్యవస్థ ధ్వంసమైన నేపథ్యంలో పునరుద్దరణ చర్యలపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎప్పటికప్పుడు పనులను సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పునరుద్దరణ పనుల్లో నిమగ్నమై ఉన్న విద్యుత్ శాఖ డీఈఈ, అవనిగడ్డ, చల్లపల్లి ఏడీఈఈలతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితి ఆరా తీశారు. గురువారం రాత్రి హోరుగాలికి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విరిగిన, ఒరిగిన 120కు పైగా విద్యుత్ స్థంభాలు పునరుద్దరించి, లైన్లు తిరిగి ఏర్పాటు చేసినట్లు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. మరో పది ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయని, రాత్రి నుంచి యుద్ధప్రాతిపదికన అదనపు సిబ్బంది సహకారం కూడా తీసుకొని పునరుద్దరణ పనులు చేపట్టి, ఇప్పటికే దాదాపు 95 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన చోట్ల కూడా పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా నూరు శాతం పునరుద్దరిస్తామని అధికారులు ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు తెలిపారు.

**వాణిజ్య పంటలకు అపార నష్టం.**నియోజకవర్గంలో సాగుతున్న వాణిజ్య పంటలకు అపారనష్టం ఏర్పడింది.మునగ ,అరటి తదితర వాణిజ్య పంటలు ఈదురుగాలులకు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి.కొన్ని పొలాల్లో పంట వ్యర్థాల తరలింపు అదనపు భారంగా మారుతుందని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు.

## డంపింగ్ యార్డ్ రహితంగా అన్ని మున్సిపాలిటీలు..

**కొత్తగా ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు**
**107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ లు**
**గత ప్రభుత్వం చెత్త పాలనతో రాష్ట్రాన్ని చెత్త కుప్పల మార్చారు**
**మంత్రి నారాయణఇబ్రహీంపట్నంలో బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు పరిశీలన**




**ఇబ్రహీంపట్నం, మే 29(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను డంపింగ్ యార్డ్ రహితంగా తయారు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి పట్టణ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఖిల్లా రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న బయో గ్యాస్ ప్లాంట్ ను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తో కలిసి మంత్రి నారాయణ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు ఉన్నాయని చెప్పారు. కొత్తగా మరో ఆరు ప్లాంట్ లు నెలకొల్పుతున్నామని చెప్పారు. ఈలోగా మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త ప్రాసెసింగ్ కోసం 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఈ ప్లాంట్ ల ద్వారా ప్రతి రోజు 5385 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసి కంపోస్ట్, బయో గ్యాస్ గా మారుస్తామని తెలిపారు. గత చెత్త ప్రభుత్వం చెత్త పాలనతో రాష్ట్రాన్ని చెత్తకుప్పల మార్చారని, చెత్త పన్ను వేసినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్ళిపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వం వదిలేసిన చెత్తను కూటమి ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. వచ్చే నెలాఖరు నాటికి ప్లాంట్ లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టీడీపీ రాష్ట్ర సీనియర్ నేత జంపాల సీతారామయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామమోహనరావు (గాంధీ), కౌన్సిలర్ చనమోలు నారాయణ, ఇబ్రహీంపట్నం పీఏసీఎస్ చైర్మన్ కోయ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## మాట్లం మాజీ సర్పంచ్ పాండు రంగారావును పరామర్శించిన ఎంఎల్ఏ



**కృత్తివెన్ను మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృత్తివెన్ను మండలం, మాట్లాం గ్రామ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాట్లం గ్రామం మాజీ సర్పంచ్ తిరుమని పాండురంగారావు ఇటీవల అనారోగ్యానికి గురైన కారణంగా శుక్రవారం నాడు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాండురంగారావు స్వగ్రహానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు తులసిరావు, జిల్లా అధికార ప్రతినిధి కూనసాని చిన్నా, శివాలయం చైర్మన్ చేకూరి వెంకట్రావు, కృత్తివెన్ను మండల ప్రధాన కార్యదర్శి యాదం రెడ్డి కొండ తదితర టిడిపి ముఖ్య నేతలు, పాండురంగారావుని పరామర్శించారు.

## వెంకన్న భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు...



**గుడ్లవల్లేరు మే 29 :(వార్తా ప్రభ ప్రతినిధి):** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం విస్తతంగా ఏర్పాట్లను సంసిద్ధం చేస్తున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిసేకాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో వేసవిలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లతో పాటు మంచినీరు, అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

# ఆక్వా రైతులకు రూ.1.50కే కరెంటు..

● ఎన్డీఏ ప్రభుత్వానికి బిజెపి నేతల కృతజ్ఞతలు




**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** ఎన్నికల సమయంలో ఆక్వా రైతులకు ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా రూ. 1.50కే కరెంటు అందిస్తామని ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలులోకి తీసుకువస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆక్వా డెవలప్మెంట్ బోర్డ్ స్టేట్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీ రాజబాబు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.5 ఉన్న కరెంటు చార్జీని రూ. 1.50కు తగ్గించి ఆక్వా రంగం, ఆక్వా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ చార్జీల తగ్గింపుతో ఆక్వా రైతులకు ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గి లాభాలు పెరుగుతాయని రాజబాబు పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అంగడాల సతీష్, సూరే గాంధీ, బిజెపి అధ్యక్షులు ఆర్ కె, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఉప్పాలపాటి దావీద్



**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** బసుస్టాండ్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుగా ఉప్పాలపాటి దావీద్ ఎన్నిపట్ల పలువురు దళిత నాయకులు అభినందించారు. ఇటీవల జరిగిన గుడివాడ ఆటో వర్కర్స్ యూనియన్ ఎన్నికలు ఇన్చార్జి సుబ్బరావు అధ్వర్యలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆటో వర్కర్స్ యూనియన్ కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకరం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు పొంగులేటి జయరాజు, ఉప్పాలపాటి అశ్వీరాదం, కోదమాల గంగాధర్, డొక్కుమాల శ్రీకాంత్‌లు మాట్లాడుతూ ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధకార్ నేతృత్వంలో జరిగిన ఎన్నికల్లో ఉప్పాలపాటి దావీద్ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా అద్దంకి రాజీవ్‌గాంధీ, ట్రజరీగా గంగిరెడ్డి తిరపతి, ఉపాధ్యక్షులుగా పిన్నబోయిన రాము, జాయింట్ సెక్రటరీగా కె.రాజేష్‌లు విజయం సాధించడం జరిగిందన్నారు. ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా మణిక్యం, గౌరవ సలహదారుడిగా కంచర్ల సుధకార్‌లు ఉండడం ఆటో యూనియన్‌కు ఎంతో బలమన్నారు. నూతన కార్యవర్గన్ని పలువురు అభినందించారు.

# కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గా కోడేబోయిన బాబి





**హనుమాన్ జంక్షన్,మే 29 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గా నియమితులైన కోడేబోయిన విజయ గంగాధర్ రావు అలియాస్ బాబి ను జిల్లా కమిటీలో నియమించినందుకు గన్నవరం ఎయిర్పోర్ట్ లో వైయస్ జగన్మోహన్ రెడ్డి నీ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే వల్లభనేని వంశీ మోహన్, కొడాలి నాని లకు కృతజ్ఞతలు తెలియజేశారు. బాబి ని వైయస్సార్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గూడవల్లి రత్న సుధాకర్, కార్యదర్శి గండి వెంకట చి న్నారావు, ఎంపిటిసి దూసరి నిర్మల, అల్లాడి తెరిసా, రాయి శివ పార్వతి, తమ్ముండ్రు రమేష్ ,వెలగపల్లి మరియన్న, బెజవాడ చందు, బీ ధర్మేంద్ర, మోర్లా ఆంజనేయులు, గండి వెంకటేశ్వరరావు, లంక రామలింగేశ్వర, ఎన్ రామిరెడ్డి, రాయి ప్రభు కుమార్, దూసరి సుధీర్, బొడ్డు యోహాను రాజు, అలుగుల రామారావు, గూడవల్లి బాబి, రాయి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్‌లో డి.వి.ఎస్. కాంప్లెక్స్ దగ్గర క్లబ్ మాజీ అధ్యక్షుడు పామర్తి కేశవరావు సహకారంతో ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత చల్లని మినరల్ వాటర్ క్యాంపును నిర్వహించినారు. ముఖ్య అతిథిగా మాజీ ఏ.వీ.పీ, బొగ్గవరపు తిరుపతయ్య పాల్గొన్నారు. సెక్రటరీ ఎం. లక్ష్మీనారాయణ రెడ్డి ప్రెసిడెంట్ గంటా చంద్రశేఖర్, డి. వి. సత్యనారాయణ, ఎం నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :

# గుడివాడలో టిడిపి హైబ్రిడ్ మహానాడు గ్రాండ్ సక్సెస్..

●10 క్లస్టర్లలో ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు.. రెండు రోజుల మహానాడులో 17,323 మంది కార్యకర్తల ఆన్లైన్ అటెండెన్స్..





**గుడివాడ,మే 29 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో టిడిపి హైబ్రిడ్ మహానాడు విజయవంతంగా ముగిసింది. పది క్లస్టర్లలో నిర్వహించిన మహానాడులో టిడిపి కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్లో జరిగిన ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన మహానాడు విజయవంతం చేసిన పార్టీ నాయకత్వాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. చంద్రబాబు చెప్పినట్లు క్లస్టర్ స్థాయిలో కొత్తగా బాధ్యతలు ఇస్తారని, సమష్టి కృషితో విజయం సాధించామని, ఈ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. మహానాడులో చంద్రబాబు, లోకేష్, పార్టీ పెద్దలు చెప్పిన మాటలను ఆచరిస్తామని చెప్పారు.రెండు రోజుల మహానాడులో.. నియోజకవర్గ వ్యాప్తంగా 17,323 మంది సభ్యత్వ కార్డులు కలిగిన కార్యకర్తల ఆన్లైన్ అటెండెన్స్ నమోదయిందని సాధారణ ప్రజానీకం హాజరు అదనమని ఎమ్మెల్యే రాము తెలిపారు. కొడాలి నానిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే రాము..పనికి మాలిన కొడాలి నాని మళ్లీ వచ్చాడనీ, ఈపాటికి జైలుకు వెళ్లసిందనీ, రోగంతో ఉన్నాడని చూసి చూడనట్లు పట్టించుకోక పోతే ఇప్పుడు పిచ్చి వాగుడు లాగుతున్నాడనీ మండిపడ్డారు. చంద్రబాబు స్థాయి గురించి మాట్లాడే అర్హతగా ఉందా? వాడు కోరలు పీకిన పాము అని విమర్శించారు. గత పాలకుల మాదిరి మనం అరాచకాలు, కబ్జాలు చెయ్యట్లేదనీ, జూద క్రీడలను ప్రోత్సహించడం లేదనీ, ప్రజలకు మంచి చెయ్యడం, గుడివాడ అభివృద్ధి నా లక్ష్యమని పేర్కొన్నారు. మనం చేస్తున్న అభివృద్ధి పవర్ ఫుల్ వెపన్ అని రానున్న రోజుల్లో ఎన్నో అభివృద్ధి పనులను ప్రజలకు చూపిస్తాను అని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. గుడివాడ శుభ్రతకు చేపట్టిన ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం కూడా అభినందించిందన్నారు., సాంకేతికంగా పార్టీ యాప్‌ల ద్వారా చంద్రబాబు, లోకేష్, తనతో మాట్లాడవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, సీనియర్ నాయకులు లింగం ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నేరుసు కాశి, పార్టీ నాయకులు యార్లగడ్డ సుధారాణి, షేక్ జానీ, పొట్లూరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు తరలిరండి

● జూన్ 6, 7 తేదీలో రాజమండ్రిలో నిర్వహణ ● అనంతలో ఘనంగా గోడపత్రికల ఆవిష్కరణ



**అనంతపురము,మే 29 (వార్తాప్రభ) :** శ్రీశ్రీ కళావేదిక, చైతన్య సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో జరగనున్న ఏడవ ప్రపంచ సాహిత్య మహాసభలకు తరలిరావాలని పలువురు కవులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో సుదీర్ఘ సాహిత్య యాత్రలో భాగంగా, ఈసారి రాజమహేంద్రవరంలో ఒక మహా సాహిత్య చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమవుతోందన్నారు. మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం అనంతపురంలో ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు ఈ. గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ఉపాధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ పతికి రమేష్ నారాయణ, హైకోర్టు న్యాయవాది, బిసిఆర్పిఎస్ అధ్యక్షులు సాకే నరేష్, కాకర్ల నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాషకు విశేష సేవలందిస్తూ, సాహిత్య, సాంస్కృతిక రంగంలో నిరంతర కృషి చేస్తున్న చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో ఏర్పాట్లు ఘనంగా చేశామన్నారు. . కిమ్స్ ఫౌండర్ ఛైర్మన్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ చైతన్య రాజు సంపూర్ణ సహకారంతో నూతనోత్తేజం కలిగిందన్నారు. “తెలుగు భాష–తెలుగు కళలు–తెలుగు సంస్కృతి–తెలుగు వైభవం–తెలుగు సంప్రదాయాలు” అన్నీ ఒకే వేదికపై వికసించనున్న ఈ సకల కళల సృజనోత్సవం రెండు రోజుల పాటు జూన్ 6, 7 (శనివారం, ఆదివారం) తేదీలలో రాజమహేంద్రవరం, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఈ మహత్తర సాహిత్య యజ్ఞానికి శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రణాళికాధికారి, విశ్రాంత డిఈఓ, ప్రముఖ రచయిత డా. టి. పార్ధసారధి నేతృత్వంలో , జాతీయ అధ్యక్షురాలు, ఏపీ ప్రభుత్వ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ కవయిత్రి గడ్డం ఈశ్వరీ భూషణం పర్యవేక్షణలో సాగనుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ కమిటీలు, పలు రాష్ట్రాలు, జిల్లా కమిటీల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక సాహిత్య , సాంస్కృతిక ఉద్యమంగా రూపుదిద్దుకుందన్నారు. గతంలో అంతర్వేది , తిరుపతి , తాడేపల్లిగూడెం (2 సార్లు ), మంచిర్యాల , ఏలూరులో ప్రపంచ సాహిత్య సభలు శ్రీశ్రీ కళావేదిక ఘనంగా నిర్వహించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మంది కవులు, కళాకారులు, రచయితలు ఉచితంగా నమోదు చేసుకున్నారని వివరించారు.

# లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో అరుదైన ఘనత




**కాకినాడ,మే 29 (వార్తాప్రభ) :** లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థిని అవంతిక ఎలుమలై తన అసాధారణ ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. చిన్న వయసులోనే ఆమె సాధించిన ఈ ఘనతపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.అవంతిక కూచిపూడి నృత్యంలో ప్రదర్శించిన ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా తలక్రిందులుగా ఉంచిన మట్టికొండపై సమతుల్యతను కాపాడుకుంటూ దాదాపు 6 నిమిషాలు 25 సెకండ్ల పాటు వివిధ భంగిమలలో నృత్య ప్రదర్శన ఇవ్వడం విశేషంగా నిలిచింది. ఆమె నృత్య ప్రదర్శనలో చూపిన ఏకాగ్రత, సమతుల్యత, నైపుణ్యం, ధైర్య సాహసాలు అందరి ప్రశంసలను అందుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. ఎన్.సుగుణా రెడ్డి మాట్లాడుతూ చిన్నారి అవంతిక ఎంతో కష్టపడి సాధన చేసి ఈ అరుదైన ఘనతను అందుకుందని తెలిపారు. నేటి విద్యార్థులు విద్యతో పాటు కళలలో కూడా ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందదాయకమని అన్నారు.అవంతిక సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ వందన బోహరా మాట్లాడుతూ, అవంతిక నృత్యం పట్ల చూపిన ఆసక్తి, అంకితభావం,పట్టుదల ఆమెను ఈ విజయానికి చేర్చాయని తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించడం సాధారణ విషయం కాదని,దీనికోసం నిరంతర సాధన, క్రమశిక్షణ ఎంతో అవసరమని చెప్పారు.విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలలో ప్రతిభను వెలికితీయడానికి పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.అవంతిక ఈ ఘనత సాధించడంతో పాఠశాలలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు ఆమెకు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మే 31న ఛలో మంగళగిరి యాదవ మహా ధర్నా

## –పాశం శ్రీ కృష్ణదేవరాయ వెల్లడి



**గుంటూరు,మే 29 (వార్తాప్రభ) :** ఛలో మంగళగిరి మహా ధర్నాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న యాదవ సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ యాదవ జాతి అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఈ మహా ధర్నా ముఖ్య ఉద్దేశం అన్నారు. యాదవ జాతికి యాదవ కుటుంబ సభ్యులకు అండగా ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం ఉంటుందనే భరోసా ఇవ్వటమే మన యాదవ సంఘం లక్ష్యంలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్ కు 6 వేల కోట్ల నిధుల, రాజధాని ప్రాంతంలో 10 ఎకరాల భూమిలో 100 కోట్లతో యాదవ భవనం, యాదవ విద్యార్థుల కొరకు హాస్టల్ వసతి గృహ నిర్మాణం, ఆవులు, గేదెలు,మేకల కొనుగోలు కోసం హామీ లేని సబ్సిడీ రుణాలు డిమాండ్ చేస్తూ మన యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మే నెల 31వ తేదీ ఆదివారం అమరావతి రాజధాని ప్రాంతం మంగళగిరిలో జరిగే యాదవ మహా ధర్నా కార్యక్రమంలో వేలాది మంది యాదవ కుటుంబ సభ్యులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ప్రతి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం కమిటీలు, ప్రతి మండలంలో కనీసం 200 మంది తో కమిటీలు వేసి, యాదవ సంఘం నిర్మాణం బలంగా చేయాలని ఆకాంక్షించారు. మండలశీలో నివసిస్తున్న యాదవ కుటుంబ సభ్యుల సమస్య ల పై పోరాటం చేయుటకు మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. యాదవ జాతి సమస్యలపై పోరాటం చేయటానికి ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

# ముద్దాయికి 15 రోజులు రిమాండ్



**కాకినాడ/రౌతులపూడి,మే 29 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలంలో ఏప్రిల్ 28వ తేదీన రౌతులపూడికి చెందిన వివాహిత మహిళ గడ్డి మందు తాగి, మే 1వ తేదీన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన భర్త కర్రి వరహాలు బాబు , ఇచ్చిన పిర్యాదు మేరకు రౌతులపూడికి చెందిన రావాడ నాని బాబు తన భార్య అశ్లీల వీడియోలను ఇన్స్టాగ్రామ్ లో పెట్టడం వలన, మన స్థాపం చెంది ఆత్మ హత్య చేసుకుంది, అనే పిర్యాదు పై రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు కేసు సెక్షన్ 108 బిఎన్ ఎస్ క్రింద కేసు నమోదు చేసి, అన్ని సాంకేతిక, భౌతిక ఆధారాలు సేకరించి, శుక్రవారం రౌతులపూడి శివాలయం దగ్గర ఈ కేసు లో ముద్దాయి అయిన రావాడ నాని బాబుని అరెస్టు చేసి, తుని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా,గౌరవ జడ్జి ముద్దాయికి 15 రోజుల జ్యుడిషల్ రిమాండు విధించారని ఎస్సై వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

# కవి సోమన్న “చిరునవ్వు” పుస్తకావిష్కరణ






**తిరుపతి,మే 29 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న పుస్తకం “చిరునవ్వు” పుస్తకావిష్కరణ ప్రెస్ క్లబ్,తిరుపతిలో ఘనంగా జరిగింది.పాత్రికేయ మిత్రుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథి, జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు అరవ జైపాల్, డా. శివకుమార్,మరియు విచ్చేసిన పుర ప్రముఖుల చేతుల మీదగా ఆవిష్కరించారు.అనంతరం ఈ పుస్తకాన్ని గుండ్లూరు సుబ్రమణ్యం గారికి అంకితమిచ్చారు.పిదప బహు గ్రంథకర్త గద్వాల సోమన్నను సన్మానించారు.ఈ కార్యక్రమంలోఆత్మీయ అతిథులు రెడ్డి కుమార్, పోతాని సుధాకర్, ఆవుల రవీంద్ర, సువర్ణ ఆనంద, మేజర్ నాగరాజు,సాహితీవేత్తలు అర్. సి. కృష్ణస్వామి రాజు,కళాకారులు, శ్రేయోభిలాషులు మరియు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి శిశు మందిరం కు కంప్యూటర్ లు అందచేత






**గూడూరు,మే 29 (వార్తాప్రభ) :** సంయుక్త నగర్ లో ఉన్న శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో శుక్రవారం తేదీన రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బత్తెన హనుమంతరావు కుమారుడు బత్తెన సనత్ కుమార్ (సన్ని) జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమైన 2 కంప్యూటర్ సిస్టమ్స్ వారి తండ్రి శ్యామల హార్డ్వేర్ అండ్ పెయింట్ అధినేత సీనియర్ రొటేరియన్ బత్తిన హనుమంతరావు సూచనలతో పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి కి రోటరీ అధ్యక్షుడు వి వెంకటేశ్వర్లు రెడ్డి అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వి వెంకటేశ్వర్లు రెడ్డి , ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ మరియు పాఠశాల కార్యదర్శి డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ సీనియర్ రొటేరియన్స్ పివి కృష్ణయ్య , డాక్టర్ ఎస్ వి నాగేంద్ర ప్రసాద్ ,ఎన్ వి రత్నం , రోటేరియన్స్ కిరణ్ చక్రవర్తి డి ఆర్ డబ్ల్యు కాలేజ్ ప్రిన్సిపాల్ హనుమంతరావు , ప్రెసిడెంట్ ఎలక్ట్ తిరుమూరు సురేష్ రెడ్డి , సెక్రటరీ ఎలెక్ట్ నాగ సునీల్ ,పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి , పాఠశాల కమిటీ సభ్యులు సనత్ కుమార్ రెడ్డి , రామ్మోహన్ , రవీంద్ర రెడ్డి , ప్రధానాచార్యులు వి. రంగనాయకులు మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయునులు , అలఘనాథ స్వామి దేవస్థానం చైర్మన్ బత్తిన సుధాకర్ రావు , బత్తిన హనుమంతరావు బంధువులు బత్తిన శ్రీనివాసులు , గుండాల రవి ,బుజ్జి , పవన్ , శరత్ , ద్వారక మరియు మిత్రులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# జాబ్ మేళాలో ఇంజనీర్లుగా ముగ్గురు ఎంపిక



**రామచంద్రపురం,మే 29 (వార్తాప్రభ) :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూల కోసం ప్రతీ వారం రామచంద్రపురం ఉపాధిభవన్లో నిర్వహించిన 43వ జాబ్ మేళాలో ఇంటర్వ్యూలలో ఏడక్కో ద్వారా ఎయిర్టెల్ ఫైబర్ నెట్ లో ముగ్గురు హెచ్ డి బి ఇంజనీర్లుగా కావడం జరిగినది. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులైన వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగింది. ఎంపికైన అభ్యర్థులందరూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉపాధి అధినేత రామ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



**కోడూరు,మే 29 (వార్తాప్రభ) :** కోడూరు మండలం విశ్వనాధపల్లి శివారు కుమ్మరిపాలెంలో తాడిచెట్టు పడి మృతి చెందిన ఇద్దరు యువకుల భౌతిక కాయాలను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సందర్శించారు. శుక్రవారం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మనోహర్, శివరామకృష్ణ భౌతిక కాయాలను సందర్శించి వారి మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కోడూరు మండల జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర వైసిపి రైతు విభాగ కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

